

RNI NO:TELTEL/ 2023/89546

# సూర్య రేఖ

తెలుగు దినపత్రిక

**విలేకరులు కావలెను**

సమాజంలో మీ కోసం.. మీరు ప్రశ్నించాలని అనుకుంటున్నారా.. అన్యాయాలను అక్రమాలను వెలుగులోకి తీసుకురావాలి అనుకుంటున్నారా.. ఇంతే కాకుండా సామాజిక నైపు ణ్యం.. సాంస్కృతిక అవగాహన..మీ ద్వారా కల్పించాలనుకుంటున్నారా.. అయితే అక్షర పంజా విసరడానికి మీ ముందుకు వచ్చింది సూర్య రేఖ తెలుగు దినపత్రికకు మండలాల వారీగా రిపోర్టర్లు కావలెను. ఆసక్తి కలవారు క్రింది నంబరును సంప్రదించగలరు.

సీనియర్లకు ప్రాధాన్యం

సంప్రదించవలసిన నెం : 9397303326

రంగారెడ్డి | సంపుటి : 2 | సంచిక : 390 | పేజీలు : 8 | ఎడిటర్ : ఎం ప్రేమ్‌రాజ్ | బుధవారం 9 ఏప్రిల్ 2025 | వెల : 4/-




# బీఆర్ఎస్ సభకు 3 వేల బస్సులు

## రజతోత్సవ సభ ఏర్పాట్లు ముమ్మరం

- ఆర్టీసీకి బస్సుల కోసం రూ.8 కోట్లు చెల్లింపు
- ఉమ్మడి వరంగల్ జిల్లా నేతలతో కేటీఆర్ భేటీ
- నేడు గ్రేటర్ పరిధిలోని నేతలతో సమావేశం
- త్వరలో నియోజకవర్గాలకు ప్రచార సామగ్రి



హైదరాబాద్

వరంగల్ సమీపంలోని ఎల్కతుర్తిలో ఈ నెల 27న జరిగే పార్టీ రజతోత్సవ సభ కోసం బీఆర్ఎస్ ఏర్పాట్లు ముమ్మరం చేసింది. ఇప్పటికే ఉమ్మడి జిల్లాలవారీగా పార్టీ కీలక నేతలతో వరుస భేటీలు నిర్వహించి అసెంబ్లీ నియోజకవర్గాలవారీగా జన సమీకరణపై పార్టీ అధినేత కే.చంద్రశేఖర్‌రావు దిశా నిర్దేశం చేశారు. కేసీఆర్ ఆదేశాల మేరకు ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జిలు సమావేశాలు ఏర్పాటు చేసుకుని జన సమీకరణ ప్రయత్నాలు వేగవంతం చేశారు. గ్రామాలవారీగా లెక్కలు వేసుకుంటూ వాహనాలు సమకూర్చుకుంటున్నారు. సభకు తరలివచ్చే ప్రజలు, బీఆర్ఎస్ కార్యకర్తల కోసం 3 వేల బస్సులు సమకూర్చాలని బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ఆర్టీసీకి దరఖాస్తు చేసింది. మాజీ ఎంపీ రావుల చంద్రశేఖర్‌రెడ్డి, బీఆర్ఎస్ విద్యార్థి విభాగం అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్ యాదవ్ తదితరులు సోమవారం ఆర్టీసీ ఎండీ సజ్జనార్‌ను కలిశారు. బస్సులకు అద్దె కోసం రూ.8 కోట్ల చెక్కును సజ్జనార్‌కు అందజేశారు. ఉమ్మడి వరంగల్ జిల్లా ముఖ్య నేతలతో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు సోమవారం నందినగర్ నివాసంలో భేటీ అయ్యారు. జన సమీకరణపై చర్చించారు. ఉమ్మడి వరంగల్ జిల్లా పరిధిలోని 12 అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి కనీసం రెండున్నర లక్షల మందిని సభకు తరలించాలని సూచించారు. అసెంబ్లీ - మిగతా3లో



తెలంగాణతో ఆర్థిక సంబంధాల

## బలోపేతంపై ఆసక్తి

- కాన్సుల్ జనరల్ ఎడ్గర్ పాంగ్
- సోలార్ పవర్, రీజినల్ రింగ్ రోడ్, మూసి పునర్జీవం, విద్య మా ప్రాధాన్యత రంగాలు
- సింగపూర్ ప్రతినిధి బృందంతో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు

హైదరాబాద్

గ్రీన్ పవర్ , రీజనల్ రింగ్ రోడ్డు, మూసి పునర్జీవం, విద్య తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ప్రాధాన్య రంగాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. సోమవారం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సచివాలయంలో సింగపూర్ కాన్సుల్ జనరల్ ప్రతినిధి బృందంతో ఆయన సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా సింగపూర్ కాన్సుల్ జనరల్ ఎడ్గర్ పాంగ్ మాట్లాడుతూ తెలంగాణతో ఆర్థిక సంబంధాలు బలోపేతం - మిగతా3లో

# ఒసాకా-కన్సాయ్ ఎక్స్‌పోకు సీఎం

- 15న జపాన్ వెళ్లనున్న రేవంత్‌రెడ్డి బృందం
- రాష్ట్రంలో పెట్టుబడి అవకాశాలను వివరించటంపై ఫోకస్
- నేడు అహ్మదాబాద్‌కు సీఎం రేవంత్, మంత్రులు



హైదరాబాద్

జపాన్‌లో జరిగే ఒసాకా-కన్సాయ్ ఎక్స్‌పో- 2025కు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఐటీ శాఖల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు వెళ్లనున్నారు. ఈ నెల 15వ తేదీ అర్ధరాత్రి హైదరాబాద్ నుంచి బయల్దేరి వారు జపాన్ వెళ్తారు. వారి వెంట పరిశ్రమల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్, సీఎం కార్యాలయ అధికారి అజిత్‌రెడ్డి కూడా వెళ్తారని సమాచారం. ఈ నెల 13వ తేదీ నుంచి అక్టోబర్ 13వ తేదీ వరకు జరిగే ఈ ఎక్స్‌పోలో వివిధ దేశాల రాజకీయ ప్రముఖులు, పారిశ్రామికవేత్తలు పాల్గొంటారు. భారత్ నుంచి కూడా పలు రాష్ట్రాల ముఖ్యమంత్రులు, మంత్రులు, పారిశ్రామిక వేత్తలు - మిగతా3లో

# గ్యాస్ సిలిండర్ ధరల పెంపు

- వాణిజ్య సిలిండర్ ధర రూ.41, గృహావసరాలకు వినియోగించే సిలిండర్‌పై రూ.50 పెంపు
- కేంద్ర పెట్రోలియం, సహాయ వాయువుల మంత్రి హర్దీప్‌సింగ్ పురీ వెల్లడి
- ఈ పెంపు ఉజ్వల పథకం లబ్ధిదారులకు కూడా వర్తిస్తుందని స్పష్టం
- ఈ పెంపు భారం వినియోగదారులపై పడబోదని.. చమురు కంపెనీలే దాన్ని భరిస్తాయని స్పష్టం



# తెలంగాణ రాష్ట్రంలో వచ్చే మూడు రోజులు వర్షాలు..

హైదరాబాద్

తెలంగాణ రాష్ట్రంలో వచ్చే మూడు రోజులు వర్షాలు కురిసే అవకాశం ఉంది. ఈ విషయాన్ని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. దక్షిణ మధ్య బంగాళఖాతంలో ఏర్పడిన అల్పపీడం కారణంగా ఉరుములు, మెరుపులతో కూడా వర్షాలు కురుస్తాయని సమాచారం. ఉపరితల ద్రోణి తూర్పు బీహార్ నుంచి ఈశాన్య జార?ండ్, ఛత్తీస్‌గఢ్ మీదుగా ఉత్తర తెలంగాణ వరకూ కొనసాగనుంది. దీని ప్రభావంతో హైదరాబాద్ నగరంలో సోమవారం మధ్యాహ్నం నుంచి వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. పలు ప్రాంతాల్లో చిరు జల్లులు కూడా కురిసాయి. - మిగతా3లో



# వక్ఫ్ బిల్లు.. జేడీయూకు షాక్ తప్పదా



**పాట్నా :** ఎన్డీఏలో వక్ఫ్ బిల్లు సెగలు పుట్టిస్తోంది. పంతం పట్టి బిజెపి పార్లమెంటులో ఈ బిల్లును ఆమోదించుకుంది. కానీ దానికి అనుకూలంగా ఓటు వేసిన పార్టీలు ఇప్పుడు మూల్యం చెల్లించుకుంటున్నాయి. బీహార్లో ముస్లిం మైనారిటీ నేతలు పెద్ద ఎత్తున జేడీయుకు గుడ్ బై చెబుతున్నారు. గత రెండు రోజులుగా ఈ రాజీనామాల పర్వం కొనసాగుతోంది. దీంతో జేడీయులో బలమైన చర్చ నడుస్తోంది. ఈ ఏడాది చివర్లో బీహార్ అసెంబ్లీకి ఎన్నికలు జరుగుతున్న తరుణంలో జెడియుకు ఇది గట్టి దెబ్బ. ఈ విషయంలో బీహార్ సీఎం నితీష్ కుమార్ సైతం పునరాలోచనలో పడినట్లు సమాచారం.ఎన్డీఏ మూడోసారి అధికారంలోకి రావడానికి ప్రధాన కారణం టిడిపి , జెడియు. ఈసారి మిత్రుల సహకారం లేకుండానే కేంద్రంలో అధికారంలోకి వస్తామని బిజెపి అగ్ర నేతలు భావించారు. కానీ ఎన్నికల ఫలితాల్లో సీన్ మారింది. మెజారిటీ మార్కుకు 40 ఎంపీ స్థానాల దూరంలో ఎన్డీఏ నిలిచిపోయింది. దీంతో 16 ఎంపీ సీట్లు తెచ్చుకున్న తెలుగుదేశం, 12 ఎంపీ సీట్లు గెలిచిన జేడీయు మద్దతు కీలకంగా మారింది. ఈ రెండు పార్టీలు మద్దతు తెలపడంతో ఎన్డీఏ అధికారంలోకి రాగలిగింది. ఎన్డీఏ కీలక భాగస్వాములుగా ఉన్న ఈ రెండు పార్టీలు.. తాజాగా వక్ఫ్ బిల్లుకు మద్దతు తెలపాల్సిన అనివార్య పరిస్థితి ఏర్పడింది. అయితే ఇది ఈ రెండు పార్టీలకు రాజకీయంగా నష్టం తప్పదని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.ఏపీ కంటే బీహార్లో ముస్లింల జనాభా అధికం. అయితే ఈ బిల్లు విషయంలో మద్దతు తెలపవద్దని నితీష్ కుమార్ తో పాటు చంద్రబాబుపై ముస్లింలు ఒత్తిడి చేశారు. కానీ వారిద్దరూ వినలేదు. అందుకే రెండు రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చిన ఇఫ్తార్ విందుకు ముస్లింలు ముఖం చాటేశారు. బీహార్ లో అయితే బాహటంగానే వ్యతిరేకించగా.. ఏపీలో మాత్రం కొంతవరకు హాజరయ్యారు. అయితే ఈ బిల్లు ఆమోదం పొందడంతో ఇప్పుడు బీహార్లో జెడియుకు నేతలు గుడ్ బై చెబుతున్నారు. ఆ పార్టీ సీనియర్ నేతలు రాజునయ్యర్, తబరేజ్ సిద్ధికి ఆలిగ్, మహమ్మద్ షానవాజ్ మాలిక్, మహమ్మద్ ఖాసిం అన్సారీలు ఇప్పటికే పార్టీకి గుడ్ బై చెప్పారు. ఈరోజు మరో సీనియర్ నేత నదీమ్ అక్తరు సైతం రాజీనామా ప్రకటించారు. వరుసగా ఐదుగురు సీనియర్లు జెడియుకు గుడ్ బై చెప్పడంతో మైనారిటీల బలం తగ్గినట్లు అయింది.బీహార్లో ముస్లిం మైనారిటీ నేతలు పెద్ద ఎత్తున జేడీయుకు గుడ్ బై చెబుతున్న తరుణంలో అందరి దృష్టి ఏపీపైపడింది. ఈ బిల్లునకు టిడిపి సైతం మద్దతు ప్రకటించింది. దీంతో ఆ పార్టీకి సైతం మైనారిటీలు దూరమయ్యే అవకాశం ఉంది. కానీ బీహార్ తో పోల్చుకుంటే ఏపీలో ముస్లింల సంఖ్య తక్కువ. తెలుగుదేశం పార్టీలో సైతం ముస్లిం నేతలు అంతంత మాత్రం. అందుకే ఆ స్థాయి ప్రభావం ఇక్కడ ఉండదని తెలుస్తోంది. అయితే మొన్నటి ఎన్నికల్లో టిడిపి కూటమికి మద్దతు తెలిపారు ముస్లింలు. అటువంటి వారంతా వచ్చే ఎన్నికల నాటికి దూరమయ్యే అవకాశం ఉందని వైసీపీ అంచనా వేస్తోంది. అయితే ఈ బిల్లును సవరించడంతో ముస్లింలకు అధిక ప్రయోజనమని.. తమ సూచన మేరకు ఈ బిల్లులో చాలావరకు సవరణలు తీసుకొచ్చారని టిడిపి చెబుతోంది. మరి ఏం జరుగుతుందో చూడాలి.

# ట్రంప్ దూకుడుకు కళ్లెం పడేనా




అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నాయకత్వానికి వ్యతిరేకంగా అమెరికావ్యాప్తంగా నిరసనలు భగ్గుమన్నాయి. మొత్తం 50 రాష్ట్రాల్లోని అనేక ప్రధాన నగరాల్లో ప్రజలు భారీ సంఖ్యలో ఉద్యమించారు. 'హ్యాండ్స్ ఆఫ్' పేరుతో ర్యాలీలు నిర్వహించి, ట్రంప్నకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అధ్యక్షుడిగా ట్రంప్ బాధ్యతలు చేపట్టిన తర్వాత ప్రతిపక్షానికి ఇది అతిపెద్ద నిరసన ప్రదర్శనగా మారింది.టారిఫ్ పేరుతో ప్రపంచ దేశాలను ట్రంప్ భయపెడుతున్న విషయం తెలిసిందే. అయితే, ట్రంప్ చర్యల వల్ల అమెరికాకి కూడా భారీ నష్టం వాటిల్లుతోంది. అమెరికా ఆర్థిక వ్యవస్థ మాంద్యంలోకి జారుకునే ప్రమాదం కనిపిస్తోంది. ఇందుకు నిరసనగా పౌరహక్కుల సంఘాలు, కార్మిక సంఘాలు, ఎల్జీబీటీక్యూ మద్దతుదారులు, అనుభవజ్ఞులు, ఎన్నికల సంస్కరణ కార్యకర్తలు సహా 150కి పైగా సంస్థల మద్దతుతో మొత్తం 50 రాష్ట్రాల్లోని 1,200 ప్రాంతాల్లో ఈ హ్యాండ్స్ ఆఫ్ ర్యాలీలు జరిగాయి. అనేక చోట్ల ఇసుకేస్తే రాలనంత జనం కనిపించారు. కాగా నిరసనకారులు శాంతియుత ఆందోళనలు చేపట్టడంతో ఎలాంటి అరెస్టు జరగలేదు.ప్రభుత్వ ఉద్యోగుల తొలగింపు, వలసలు, ఆర్థిక వ్యవస్థ, మానవ హక్కులు వంటి అంశాలపై డొనాల్డ్ ట్రంప్, బిలియనీర్ ఎలాన్ మస్కను విమర్శించడానికి నేషనల్ మాల్ అండ్ మిడ్టౌన్ మానహట్టన్ నుంచి బోస్టన్ కామన్, వివిధ రాష్ట్ర క్యాపిటల్స్ వరకు వేలాది మంది నిరసనకారులు అమెరికా అంతటా గుమిగూడారు. సియాటెల్లో నగరంలోని ప్రఖ్యాత స్పేస్ నీడిల్ సమీపంలో నిరసనకారులు "నియంతృత్వానికి వ్యతిరేకంగా పోరాడండి" అనే నినాదాలతో కూడిన ప్లకార్డులను ప్రదర్శించారు.ట్రంప్ సలహాదారు, టెస్లా, స్పేస్ఎక్స్, సోషల్ మీడియా ప్లాట్ఫామ్ ఎక్స్ అధిపతి ఎలాన్ మస్క్ కొత్తగా ఏర్పాటైన డిపార్ట్మెంట్ ఆఫ్ గవర్నమెంట్ ఎఫీషియెన్సీ (డీఓజీ) చీఫ్గా ప్రభుత్వ ప్రయత్నాలకు నాయకత్వం వహిస్తున్నారు. తన పని పన్ను చెల్లింపుదారులకు కోట్లాది రూపాయలు ఆదా చేస్తోందని ఆయన పేర్కొన్నారు. కానీ ఆయన చర్యలతో చాలా మంది ఉద్యోగాలు కోల్పోయారు. ఇది చర్చకు దారితీసింది.నేషనల్ మాల్ ర్యాలీలో హ్యూమన్ రైట్స్ క్యాంపెయిన్ అధ్యక్షుడు కెల్లీ రాబిన్సన్ ఎల్జీబీటీక్యూ కమ్యూనిటీ పట్ల ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరును విమర్శించారు. కాంగ్రెస్కు చెందిన పలువురు డెమొక్రటిక్ సభ్యులు కూడా ప్రజలనుద్దేశించి ప్రసంగించారు."మనం చూస్తున్న దాడులు కేవలం రాజకీయమైనవి కావు – అవి వ్యక్తిగతమైనవి. వారు మా పుస్తకాలను నిషేధించడానికి, హెచ్ఐవి నివారణ నిధులను తగ్గించడానికి, మా వైద్యులు, మా ఉపాధ్యాయులు, మా కుటుంబాలు, మా జీవితాలను నేరపూరితం చేయడానికి ప్రయత్నిస్తున్నారు," అని కెల్లీ రాబిన్సన్ అన్నారు.లో నిరసనకారులు "ప్రజాస్వామ్యాన్ని నుంచి చేతులు తీయండి (హ్యాండ్స్ ఆఫ్)", "సామాజిక భద్రత నుంచి చేతులు తీయండి (హ్యాండ్స్ ఆఫ్)," వంటి బోర్డులను ప్రదర్శించారు. కొలంబస్లోని స్టేట్ హౌస్లో గుమిగూడిన వందలాది మందిలో ఒహాయోలోని డెలావేర్ కౌంటీకి చెందిన 66 ఏళ్ల రిటైర్డ్ రోజర్ బ్రూమ్ కూడా ఉన్నాడు. తాను ఒకప్పుడు రీగన్ రిపబ్లికన్గా గుర్తింపు తెచ్చుకున్నానని, కానీ ఆ తర్వాత ట్రంప్ పట్ల విరక్తి చెందానని చెప్పారు."ఆయన ఈ దేశాన్ని ఛిన్నాభిన్నం చేస్తున్నారు. ఇది కేవలం ఫిర్యాదుల పరిపాలన మాత్రమే," అని బ్రూమ్ అన్నారు.న్యూయార్క్ పెయింటర్ షైనా కెస్నర్ (43) మాన్హాటన్ నడిబొడ్డున కవాతు చేస్తున్న ఒక గుంపులో చేరి నిరసన తెలిపారు. "నేను చాలా కోపంగా ఉన్నాను. తెల్లజాతి రేపిస్టుల గుంపు మన దేశాన్ని శాసిస్తోంది. అది సరైనది కాదు," అని అన్నారు.ఫ్లోరిడాలోని జూపిటర్లో జరుగుతున్న సీనియర్ క్లబ్ చాంపియన్షిప్లో డొనాల్డ్ ట్రంప్ పాల్గొనగా పామ్ బీచ్ గార్డెన్స్లో వందలాది మంది నిరసనకారులు గుమిగూడి నిరసనలు తెలిపారు.అధ్యక్షుడు ట్రంప్ వైఖరి స్పష్టంగా ఉంది: అర్హులైన లబ్ధిదారులకు సామాజిక భద్రత, మెడికేర్ను ఆయన ఎల్లప్పుడూ పరిరక్షిస్తారు. ఇంతలో, డెమొక్రాట్ల వైఖరి అక్రమ విదేశీయులకు సామాజిక భద్రత, మెడికేర్ ప్రయోజనాలను ఇస్తోంది. ఇది ఈ కార్యక్రమాలను దివాళా తీస్తుంది. అమెరికన్ సీనియర్లను అణచివేస్తుంది," అని వైట్ హౌస్ చెప్పుకొచ్చింది. మరో వైపు ట్రంప్ టారిఫ్ల మోతకు ప్రపంచ ఆర్థిక వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. స్టాక్ మార్కెట్లు కుప్పకూలాయి. ధరలు విపరీతంగా పెరుగుతున్నాయి. మరోవైపు అమెరికాలోనూ ఆర్థిక మాంద్యం ఏర్పడే అవకాశం ఉందని ఆదేశ ఆర్థిక నిపుణులు హెచ్చరిస్తున్నారు. ధరలు విపరీతంగా పెరుగుతాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉంటే.. టారిఫ్ ప్రభావంతో ఇరాన్ కరెన్సీ, ఇరానియన్ రియాల్ , మళ్లీ భారీ పతనాన్ని చవిచూసింది. ఒక అమెరికన్ డాలర్తో పోలిస్తే రియాల్ విలువ 10,43,000కి చేరుకుని చరిత్రలో అత్యంత కనిష్ఠ స్థాయిని తాకింది. ఈ సంక్షోభం నేపథ్యంలో రానున్న రోజుల్లో దీని విలువ ఎంతమేరకు తగ్గుతుందన్నది అనిశ్చితంగా మారింది. టెహ్రాన్లోని ఫెర్దౌసీ వీధి, దేశంలో కరెన్సీ మారక కేంద్రంగా ఉన్నప్పటికీ, అనేక మంది వ్యాపారులు నగదు బదిలీ వ్యాపారాన్ని నిలిపివేశారు.రియాల్ పతనం వల్ల ఇరాన్లో ద్రవ్యోల్బణం 40% దాటింది. ఆహార ధరలు కొన్ని సందర్భాల్లో 100% వరకు పెరిగాయి. సామాన్య ప్రజలు తమ ఆదాయాన్ని డాలర్లు, బంగారం వంటి సురక్షిత ఆస్తుల్లోకి మార్చడం వల్ల రియాల్పై ఒత్తిడి మరింత పెరుగుతోంది. నిపుణుల అభిప్రాయం ప్రకారం, అంతర్జాతీయ ఆంక్షలు ఎత్తివేయకపోతే, ఈ సంక్షోభం తీవ్రతరమై ఆర్థిక స్థిరత్వం మరింత దెబ్బతింటుంది. ప్రస్తుతం ఇరాన్ ప్రభుత్వం ఈ సమస్యను ఎదుర్కొనేందుకు కొత్త వ్యూహాలను రూపొందించాల్సిన అవసరం ఉంది, లేకపోతే రాబోయే రోజుల్లో పరిస్థితి మరింత దిగజారే అవకాశం ఉంది.

# ఆక్వారంగం.... సాయం కోసం ఎదురు చూపులు

**ఏలూరు :** అమెరికా సుంకాల కారణంగా నష్టపోతున్న ఆక్వా రంగానికి అండగా ఏపీ సీఎం చంద్రబాబు రంగంలోకి దిగారు. రైతుల పరిస్థితిని వివరిస్తూ కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ కు చంద్రబాబు లేఖ రాశారు. ట్రంప్ విధిస్తున్న అడ్డగోలు సుంకాల నుంచి ఆక్వా ఉత్పత్తులు మినహాయింపు పొందేలా ప్రయత్నాలు చేసి రైతులను ఆదుకోవాలని కేంద్రమంత్రి పీయూష్ గోయల్ ను కోరారు ముఖ్యమంత్రి చంద్రబాబు.రాష్ట్ర జీడీపీలో ఆక్వా రంగం కీలకమైన భూమిక పోషిస్తోందని, సంక్షోభ సమయంలో ఆక్వా రైతులకు అండగా నిలవాలని విజ్ఞప్తి చేశారు. భారత దేశం నుంచి వెళ్లే సముద్ర ఆహార ఎగుమతులపై అమెరికా 27శాతం దిగుమతి సుంకం విధించింది. 2023–24 ఆర్థిక సంవత్సరంలో మన దేశం నుంచి అమెరికాకు 2.55 బిలియన్ డాలర్ల విలువైన సముద్ర ఆహార ఉత్పత్తులు ఎగుమతయ్యాయి. వీటిలో రొయ్యలే 92శాతం వాటాను కలిగున్నాయి. అమెరికా దేశానికి రొయ్యల ఎగుమతిలో కీలకమైన భారత దేశంపై 27శాతం దిగుమతి సుంకం కారణంగా ఆక్వా రైతాంగం నష్టపోతుందని ముఖ్యమంత్రి చంద్రబాబు లేఖలో ప్రస్తావించారు.ఇక ఈక్వెడార్ వంటి ఎగుమతిదారులపై కేవలం 10శాతం సుంకమే విధించింది అమెరికా. ఇది మన దేశానికి పరోక్షంగా నష్టం చేస్తూ వారికి అనుకూలంగా మారుతుందన్నారు. దీనికి తోడు మన దేశ ఎగుమతిదారులు ఇప్పటికే 5.77 శాతం కౌంటర్ రెయిలింగ్ డ్యూటీ భారాన్ని మోస్తున్నారు. అన్ని సుంకాలను కలుపుకుంటే ఈక్వెడార్, భారత్ దేశానికి మధ్య సుంకాల వ్యత్యాసం దాదాపు 20శాతం ఉంటుంది.అమెరికా విధించిన కొత్త సుంకం ఏప్రిల్ 5 నుంచి అమల్లోకి వచ్చింది. దీని కారణంగా అమెరికా వెళ్లే అన్ని ఎగుమతులపైన ఈ భారం పడుతుందని అభిప్రాయపడ్డారు చంద్రబాబు. గతంలో వచ్చిన ఆర్డర్స్ కు అనుగుణంగా ఇప్పటికే సేకరించిన ఉత్పత్తులు ప్యాకింగ్ చేయబడి కోల్డ్ స్టోరేజ్ పోట్లలో ఉన్నాయి. కొత్త నిబంధనల వల్ల ఈ ఉత్పత్తులపై సుంకాల భారం పడుతుంది.యూరోపియన్ యూనియన్ లో భారతీయ ఎగుమతిదారులు 50శాతం తనిఖీ రేట్లు, 4 నుంచి 7 శాతం దిగుమతి సుంకంతో సహా నాన్ టారిఫ్ అడ్డంకులు ఎదుర్కొంటున్నారు. కానీ వియత్నం వంటి దేశాలు యూరోపియన్ యూనియన్ తో ఫ్రీ ట్రేడ్ అగ్రిమెంట్ కింద జీరో డ్యూటీ పొందాయి. ఈ కారణంగా వియత్నాం వంటి దేశాలు యూరోపియన్ మార్కెట్ ను ఆక్రమిస్తున్నాయని తెలిపారు చంద్రబాబు.ఇక వియత్నాం, థాయిలాండ్, జపాన్ దేశాల మార్కెట్లు భారత్ నుంచి సీ ఫుడ్స్ కొనుగోలు చేసి వాటిని ప్రాసెస్ చేసి అమెరికాకు ఎగుమతి చేస్తాయి. అయితే, ఇప్పుడు అంతిమ ఉత్పత్తులపై విధించిన అధిక ట్యాక్స్ ల కారణంగా ఆ దేశాలు కూడా మనకిచ్చిన ఆర్డర్స్ ను రద్దు చేసుకున్నాయి. ఏపీలో కోల్డ్ స్టోరేజ్ లు కూడా నిండిపోవడంతో చేతికి వచ్చిన ఆక్వా పంటను ఎక్కడ ఉంచాలో కూడా తెలియడం లేదని గందరగోళమైన పరిస్థితిలో రైతాంగం ఉందని తెలిపారు. మరోవైపు 27శాతం సుంకాల కారణంగా రైతుల నుంచి పంట సేకరించడాన్ని ఎగుమతిదారులు నిలిపేశారు. ఈ పరిణామాలు రాష్ట్ర ఆక్వా రంగాన్ని సంక్షోభంలోకి నెట్టివేస్తున్నాయన్నారు చంద్రబాబు

## భారత్‌లో ఎయిర్ ట్యాక్సీ...



**హైదరాబాద్ :** భారతదేశంలో ఎయిర్ మొబిలిటీ రంగంలో ఒక పెద్ద మార్పు రాబోతోంది. సర్లా ఏవియేషన్ అనే ఏరోస్పేస్ స్టార్టప్ కంపెనీ దేశంలోనే మొట్టమొదటి ఎలక్ట్రిక్ ఫ్లయింగ్ టాక్సీ "శూన్య"ను 2028 నాటికి విడుదల చేయనున్నట్లు ప్రకటించింది. మొదట ఈ సేవ బెంగళూరులో ప్రారంభించబడుతుంది. ఆ తర్వాత ఢిల్లీ, ముంబై, నోయిడా, పూణే వంటి మహానగరాలకు విస్తరించబడుతుంది.ఈ సేవను భారతదేశం అంతటా 5 సంవత్సరాలలో విస్తరించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు కంపెనీ సీఈఓ అడ్రియన్ ష్మిట్ తెలిపారు. ప్రత్యేక విషయం ఏమిటంటే, దీని ఒక ట్రిప్ ధర ఓలా, ఊబర్ ప్రీమియం క్యాబ్ సర్వీస్‌తో సమానంగా ఉంటుంది. తద్వారా ఇది సాధారణ ప్రజలకు కూడా అందుబాటులో ఉంటుంది.శూన్య ఎయిర్ టాక్సీ పూర్తిగా ఎలక్ట్రిక్ ప్లాట్‌ఫారమ్‌పై అభివృద్ధి చేయబడింది. ఇది గంటకు 250 కిలోమీటర్ల గరిష్ట వేగంతో ఎగరగలదు. ఒక్కసారి ఛార్జ్ చేస్తే 160 కిలోమీటర్ల దూరం ప్రయాణించగలదు. అయితే, ట్రాఫిక్ సమస్య నుంచి ఉపశమనం పొందడానికి దీనిని 25 నుండి 30 కిలోమీటర్ల దూరంలోని నగర ప్రయాణాల కోసం ఉపయోగించాలని కంపెనీ లక్ష్యంగా పెట్టుకుంది.ఈ టాక్సీలో ఒకేసారి ఆరుగురు ప్రయాణికులు, ఒక డ్రైవర్ ప్రయాణించవచ్చు. దీని మొత్తం లోడింగ్ సామర్థ్యం దాదాపు 680 కిలోగ్రాములు. కంపెనీ ప్రస్తుతం దీని నమూనాను ప్రదర్శించింది, అయితే ఉత్పత్తి వెర్షన్‌లో అనేక సాంకేతిక నవీకరణలు చూడవచ్చు.శూన్య ఎయిర్ టాక్సీని కేవలం ప్రయాణీకుల రవాణా కోసం మాత్రమే కాకుండా, అత్యవసర వైద్య సేవల కోసం కూడా అభివృద్ధి చేస్తున్నారు. పట్టణ ప్రాంతాల్లోని తీవ్రమైన రోగులను ట్రాఫిక్ నుండి తప్పించి సమయానికి ఆసుపత్రికి చేర్చడానికి ఉచిత ఎయిర్ అంబులెన్స్ సేవను కూడా ప్రారంభిస్తామని కంపెనీ ప్రకటించింది. ఈ ఆవిష్కరణ భారతదేశం ఏరోస్పేస్ టెక్నాలజీ, గ్రీన్ ట్రాన్స్‌పోర్ట్ దిశగా ఒక విప్లవాత్మక అడుగుగా పరిగణించబడుతోంది.

## మ్యాట్రిమోనీ యప్ తో మోసం

**హైదరాబాద్ :** హైదరాబాద్‌కు చెందిన ఒక యువతి ఆన్‌లైన్‌లో పరిచయమైన వ్యక్తి చేతిలో లైంగిక వేధింపులకు, ఆర్థిక దోపిడీకి గురైంది. ఆమె ఫిర్యాదు ఆధారంగా, చిల్కల్‌గూడ పోలీసులు కేసు నమోదు చేసి.. నిందితుడు, నాగోల్ నివాసి అయిన 34 ఏళ్ల కొర్రా రాజా అలియాస్ కొర్రా రాజ్ చౌహాన్ అనే వ్యక్తిని అరెస్టు చేశారు. మాయమాటలతో నమ్మించి బాధితురాలిని లైంగికంగా లోబరుచుకున్నట్లు నిందితుడు ఆరోపణలు ఎదుర్కొంటున్నాడు. బాధితురాలు ఏప్రిల్ 1న పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఈ సంఘటన వెలుగులోకి వచ్చిందిచిల్కలగూడ పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌ఓ బి. అనుదీప్ మాట్లాడుతూ.. నిందితుడు మ్యాట్రిమోనియల్ యాప్ ద్వారా యువతిని సంప్రదించాడని, ఆమె నమ్మకాన్ని సంపాదించడానికి మూడు నెలలపాటు మాయ మాటలు చెప్పినట్లు గుర్తించారు. ఆమెతో ఎమోషనల్ బాండింగ్ ఏర్పరచుకున్న తర్వాత, పలుమార్లు ఆమెపై లైంగిక దాడి చేశాడు. తరువాత ఆమె సున్నితమైన వ్యక్తిగత సమాచారాన్ని ఉపయోగించి ఆమెను బ్లాక్ మెయిల్ చేశాడు. రూ. 1.5 లక్షలు బలవంతంగా వసూలు చేసినట్లు తెలుస్తోంది. కొర్రా రాజాకు ఆల్రెడీ మ్యారేజ్ అయినట్లు పోలీసుల విచారణలో బయటపడింది.అతను మహిళలను ట్రాప్ చేసేందుకు మ్యాట్రిమోనియల్ సైట్లలో అనేక నకిలీ ప్రొఫైల్‌లను సృష్టించాడని పోలీసులు చెబుతున్నారు. బాధితులను ఆర్థికంగా, మానసికంగా దోపిడీ చేసేవాడని వెల్లడించారు. విచారణలో, నిందితుడు వివాహ యాప్‌ల ద్వారా చాలామంది మహిళలను వేధించినట్లు అంగీకరించాడు. పోలీసులు మ్యాట్రిమోనియల్ యాప్ నుంచి చాట్ రికార్డులు, బ్యాంక్ లావాదేవీ రుజువులు, ఇతర డిజిటల్

## గ్యాస్ సిలిండర్ ధరల పెంపు

**న్యూఢిల్లీ :** కేంద్ర ప్రభుత్వం మధ్య తరగతి వినియోగదారులపై గ్యాస్ భారాన్ని పెంచేసింది. మరోసారి గ్యాస్ సిలిండర్ ధరలను పెంచుతున్నట్లు ప్రకటించింది. గత వారంలో వాణిజ్య సిలిండర్ ధరను రూ.41కి పెంచిన కేంద్రం ఇప్పుడు గృహావసరాలకు వినియోగించే 14.2 కిలోల ఎల్పిజి సిలిండర్‌పై రూ.50 పెంచింది. ఈ విషయాన్ని కేంద్ర పెట్రోలియం, సహాయ వాయువుల మంత్రి హర్దీప్‌సింగ్ పురీ వెల్లడించారు.అయితే ఈ పెంపు ఉజ్వల పథకం లబ్ధిదారులకు కూడా వర్తిస్తుందని ఆయన స్పష్టం చేశారు. అయితే దీంతో పాటు సోమవారం పెట్రోల్, డీజిల్‌పై రూ.2 చొప్పున ఎక్సైజ్ డ్యూటీని పెంచుతూ కేంద్రం ఉత్తర్వులు జారీ చేసింది. అయితే ఈ పెంపు భారం వినియోగదారులపై పడబోదని.. చమురు కంపెనీలే దాన్నీ భరిస్తాయని స్పష్టం చేసింది. పెరిగిన పెట్రోల్, డీజిల్ ధరలు ఏప్రిల్ 8వ తేదీ నుంచి అమలులోకి రానున్నాయి.

## 15 తర్వాత అమరావతికి మోడీ...

**అమరావతి :** గత టీడీపీ ప్రభుత్వంలో ఏపీ రాజధాని అమరావతి నిర్మాణానికి శంకుస్థాపన చేసేందుకు వచ్చిన ప్రధాని మోదీ.. పిడికెడు మట్టి, చెంబుడు నదీ జలాలను తీసుకొచ్చారు. నిధులిస్తారనుకుంటే, నీళ్లు, మట్టి మాత్రమే ఇచ్చారంటూ అప్పట్లో ఓ రేంజ్ లో సెటైర్లు పేలాయి. ఆ తర్వాత టీడీపీ, బీజేపీకి మధ్య వైరం మొదలు కావడంతో ఆ ప్రహసనాన్ని టీడీపీ నేతలే తీవ్రంగా తప్పుబట్టారు. మళ్లీ ఇప్పుడు అదే సీన్ రిపీట్ కాబోతోంది. ఈనెల 3వ వారంలో అమరావతి నిర్మాణ పనుల పునఃప్రారంభోత్సవానికి ప్రధాని నరేంద్రమోదీ రాబోతున్నారు. కనీసం ఈసారయినా ఆయన నిధులు తెస్తారా.. అమరావతికి, ఏపీకి ఏదైనా శుభవార్త చెబుతారా అనేది వేచి చూడాలి.ఈనెల మూడో వారం లేదా, నాలుగో వారంలో ప్రధాని మోదీ అమరావతికి వస్తారని తెలుస్తోంది. అధికారికంగా ఈ పర్యటన ఇంకా ఖరారు కాలేదు. అయితే ప్రధాని మోదీ రాక కోసం ప్రభుత్వం ఆల్రడీ ఏర్పాట్లు చేస్తోంది. రాజధాని అమరావతి నిర్మాణ పనుల పునఃప్రారంభోత్సవాన్ని ఆయన చేతుల మీదుగా మొదలు పెట్టడానికి ఏపీ ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. ఈ కార్యక్రమానికి లక్షమంది హాజరయ్యేలా, భారీ ఎత్తున ప్రణాళికలు రచిస్తున్నారు. వెలగపూడి సమీపంలో రాష్ట్ర సచివాలయం వెనక ఈ కార్యక్రమం ఏర్పాటు చేస్తారు. 250 ఎకరాల్లో సభ ఏర్పాట్లు చేస్తున్నారు. సభాప్రాంగణానికి చేరుకోడానికి 8 మార్గాలను గుర్తించారు, ఆయా మార్గాలకు ఇన్ చార్జ్ లను నియమించి అన్నీ పక్కాగా జరిగేలా చూస్తున్నారు.ఏపీలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో మూడు రాజధానుల కాన్సెప్ట్ పూర్తిగా పక్కనపడిపోయిన ట్టయింది. ఏపీకి ఏకైక రాజధాని అమరావతి అని తేలిపోయింది. వైసీపీ కూడా మూడు రాజధానుల నిర్ణయాన్ని అటకెక్కించేసిందని అర్థమవుతోంది. ఆ మధ్య శాసన మండలిలో మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ కూడా మూడు రాజధానుల విషయంలో తాము ఆలోచించుకోవాల్సి ఉందన్నారు. అమరావతిని కాదంటే ఫలితం ఎలా ఉంటుందో జగన్ కి తెలిసొచ్చిందని టీడీపీ నేతలు అంటున్నారు. ఒకరకంగా జగన్ కూడా తన మూడు రాజధానుల నిర్ణయాన్ని పక్కనపెట్టేసినట్టేనని తేలిపోయింది. ఈ దశలో అమరావతి నిర్మాణాన్ని తిరిగి భుజానికెత్తుకున్నారు సీఎం చంద్రబాబు. ప్రపంచంలోనే గొప్ప రాజధానిగా అమరావతికి గుర్తింపు తెస్తామంటున్నారు.2014లో తొలిసారి ప్రధాన మంత్రి అయిన తర్వాత ఏపీ రాజధాని అమరావతికి మోదీ శంకుస్థాపన చేశారు. ఉద్దండరాయునిపాలెంలో రాజధాని నగర నిర్మాణానికి 2015 అక్టోబరు 22న విజయదశమి నాడు ఈ శంకుస్థాపన కార్యక్రమం జరిగింది. కొంతమేర పనులు జరిగినా అనుకున్న టైమ్ కి అవి పూర్తి కాలేదు. 2019లో ప్రభుత్వం మారడంతో అమరావతి నిర్మాణ పనులు ఆగిపోయాయి. జగన్ మూడు రాజధానుల వ్యూహం తెరపైకి తెచ్చారు. దీంతో అమరావతిని పక్కనపెట్టారు. ఇప్పుడు తిరిగి కూటమి అధికారంలోకి రావడంతో అమరావతి పనుల్లో పురోగతి కనపడుతోంది. అమరావతి నిర్మాణ పనుల పునఃప్రారంభోత్సవానికి తిరిగి ప్రధాని మోదీనే ఆహ్వానించారు సీఎం చంద్రబాబు. మోదీతో కొత్త నిర్మాణాలకు శంకుస్థాపనలు చేయిస్తారు.

# సంక్షేమ పథకాలకు..నిధులు ఎలా



**హైదరాబాద్ :** రేవంత్ ప్రభుత్వం పలు సంక్షేమ పథకాలను అత్యంత ప్రతిష్టాత్మకంగా భావిస్తోంది. వాటిల్లో ముఖ్యంగా రైతు భరోసా, రాజీవ్ యువ వికాసం పథకాలపై ప్రత్యేక దృష్టి పెట్టింది. వీటి అమలు కోసం భారీగా నిధులు కావాలి. దీంతో ఆర్థిక శాఖ అధికారులు నిధుల సేకరణపై ఫోకస్ పెట్టారు.తెలంగాణ ప్రభుత్వం రెండు సంక్షేమ పథకాలను ప్రతిష్ఠాత్మకంగా భావిస్తుంది. వీటి అమలు కోసం మూడు నెలల్లో దాదాపు రూ.15 వేల కోట్లు అవసరం అని తెలుస్తోంది. ఆ నిధుల సమీకరణకు ప్రత్యామ్నాయ వనరులు, రుణాలపై ఆర్థిక శాఖ ఫోకస్ పెట్టింది. ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన రాజీవ్ యువ వికాసం పథకాన్ని.. ఈ ఆర్థిక సంవత్సరం నుంచే అమలు చేయనున్నారు.రాజీవ్ యువ వికాసం పథకంలో భాగంగా.. ఇప్పుడు నిరుద్యోగుల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్నారు. అర్హులను ఎంపిక చేసి.. జూన్ 2న రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా ఆర్థిక సాయం మంజూరు పత్రాలను పంపిణీ చేస్తామని ప్రభుత్వం ఇప్పటికే ప్రకటించింది. ఈ పథకానికి రూ.6 వేల కోట్లు ఇస్తామని స్పష్టం చేసింది. జూన్ 2 నాటికి ఈ పథకం కోసం రూ.6 వేల కోట్లు నిధులు కావాలి.ఇక జూన్ నుంచే ఖరీఫ్ పంటల సాగు సీజన్ ప్రారంభం కానుంది. ఈ నేపథ్యంలో రైతు భరోసా పథకం కింద ఎకరానికి రూ.6 వేల చొప్పున రైతుల ఖాతాల్లో జమ చేయాల్సి ఉంది. రైతు భరోసాకు ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రెండు పంటలకు కలిపి.. రూ.18 వేల కోట్లను బడ్జెట్‌లో కేటాయించారు. వీటిలో రూ.9 వేల కోట్లను ఖరీఫ్ సాగుకు పెట్టుబడి కింద వ్యవసాయ శాఖకు విడుదల చేయాలి.ఈ రెండు పథకాల అమలు కోసం జూన్ నాటికి రూ.15 వేల కోట్లను ఆర్థిక శాఖ సిద్ధం చేయాల్సి ఉంది. దీంతో అధికారులు నిధుల సేకరణపై ప్రత్యేక దృష్టి పెట్టారు. ఇతర శాఖలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు కూడా మరిన్ని నిధులు విడుదల చేయాల్సి ఉంటుంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఈ నెల ఒకటిన ప్రారంభం కాగా.. ఈ నెల 8న బాండ్ల విక్రయం ద్వారా రూ.2 వేల కోట్ల నూతన రుణాల సేకరణకు ఆర్థికశాఖ ప్రయత్నాలు చేస్తోంది.మరోవైపు రాష్ట్రంలో విద్యుత్ డిమాండ్ భారీగా పెరుగుతుంది. ఈ నేపథ్యంలో.. ప్రభుత్వం ఈ ఏడాది ఇంధన శాఖకు బడ్జెట్‌లో రూ.21 వేల కోట్లు కేటాయించింది. వీటి నుంచి విద్యుత్ సంస్థలకు రాబోయే మూడు నెలల్లో రూ.5 వేల కోట్ల వరకు విడుదల చేయాల్సి ఉంటుంది. యువ వికాసం, రైతుభరోసా, విద్యుత్ రాయితీ నిధులు తప్పనిసరిగా విడుదల చేయాల్సినవే. అందుకే వాటికే ప్రాధాన్యమిస్తూ సమీకరిస్తున్నట్లు ఆర్థిక శాఖ అధికారులు చెబుతున్నారు. ప్రభుత్వ భూముల విక్రయాల ద్వారా నిధులు సమీకరించవచ్చని తొలుత భావించారు. కానీ ప్రస్తుతం అది సాధ్యం కాదని తెలుస్తోంది. దీంతో ప్రత్యామ్నాయ మార్గాలపై ప్రభుత్వం ఫోకస్ పెడుతోంది. కొత్త రుణాల సేకరణపైనే ఎక్కువగా ఆశలు పెట్టుకుంటున్నట్టు సమాచారం. ప్రస్తుతం పన్నుల ద్వారా వచ్చే ఆదాయం ఉద్యోగుల జీతభత్యాలు, పింఛన్లు, పాత రుణాలపై వడ్డీలు, అసలు కిస్తీల చెల్లింపులకే సరిపోతోందని తెలుస్తోంది.ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తున్న సంక్షేమ పథకాలకు ఇవ్వాల్సిన నిధులను.. ఇతర మార్గాల ద్వారా సమీకరించక తప్పదని అధికారులు చెబుతున్నారు. అమలు చేయాల్సిన తేదీలు దగ్గరపడుతున్న నేపథ్యంలో.. అధికారులు కూడా ప్రయత్నాలు ముమ్మరం చేశారు.

# కేసీఆర్‌పై మరో కేసు?



**హైదరాబాద్ :** కేటీఆర్ కు అత్యంత అనుచరుడు కొణతం దిలీప్ విదేశీ పర్యటనల ఖర్చు.. కొత్త సెక్రటేరియట్ నిర్మాణానికి అదనపు వ్యయం.. ఇలా చెప్పుకుంటూ పోతే బొచ్చెడు. కానీ ఏ ఒక కేసులోనూ కెసిఆర్ ను రేవంత్ రెడ్డి ఇరికించలేదు. ఇబ్బంది పెట్టే ప్రయత్నం చేయలేదు. ఏదో అనుకూల మీడియాలో గట్టి ప్రచారం తప్ప.. ఇంతవరకు ఊదు కాలింది లేదు.. పీరి లేచింది లేదు.. ఇక ఇప్పుడు తాజాగా రేవంత్ రెడ్డి ప్రభుత్వం నమస్తే తెలంగాణ మీద ఫోకస్ పెట్టింది. గతంలో ఇది లక్ష్మి రాజానికి చెందింది.అధికారంలోకి వచ్చిన తర్వాత కెసిఆర్ దీనిని ఓన్ చేసుకున్నాడు. తెలంగాణ ఉద్యమ సమయంలో రాజ్ న్యూస్ అప్పటి టిఆర్ఎస్ గొంతుగా ఉండేది. ఇది తెలంగాణ భవన్ కేంద్రంగానే చాలా రోజులపాటు కార్యకలాపాలు సాగించింది. అధికారంలో ఉన్నన్ని రోజులు నమస్తే తెలంగాణ, టీ న్యూస్, తెలంగాణ టుడే పేపర్లకు విపరీతంగా ప్రభుత్వ ప్రకటనలు వచ్చేవి. గత పది సంవత్సరాలలో ఈ మీడియా సంస్థలకు ప్రభుత్వం 348.43 కోట్లను ప్రకటనల రూపంలో ఇచ్చినట్టు తెలుస్తోంది. ఇప్పుడు ఈ విషయాన్ని విజిలెన్స్ అధికారుల బృందం ప్రాథమికంగా గుర్తించింది. దీనికి సంబంధించిన దర్యాప్తుని కూడా మొదలుపెట్టింది. ఇక ఇదే విషయంపై సమాచార శాఖ మంత్రిగా ఉన్న పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఓపెన్ గా అయిన విమర్శలు చేశారు..” పత్రికలకు సర్కులేషన్.. చానల్స్ కు రేటింగ్ ఆధారంగా టారిఫ్ ఇస్తారు. గులాబీ పార్టీ తెలంగాణ రాష్ట్రాన్ని పరిపాలిస్తున్న సమయంలో సొంత మీడియా కోట్ చేసిన ధరకు సమాచార అధికారులు ఒకే చెప్పారని” ఇటీవల పొంగులేటి ఆరపించారు.ఇక సమాచార శాఖలో పనిచేస్తున్న విశ్రాంత అధికారులు కూడా టిఆర్ఎస్ సొంత మీడియా గా పేరుపొందిన తెలంగాణ టుడే విషయంలోనూ నిబంధనలు ఉల్లంఘించారని ఆరోపించారు. నిబంధన ప్రకారం ఒక పత్రిక 18 నెలల పాటు నిరంతరాయంగా పబ్లిష్ అవ్వాలి. ఆ తర్వాత ఇంకా గవర్నమెంట్ యాడ్స్ జారీకి ఎం ప్యానల్ లో చోటు దక్కించుకోవాలి. ఆ తర్వాతే దానికి ప్రకటనలు ఇవ్వాలి. కానీ తెలంగాణ టుడే ఏర్పాటైన మూడు నెలలకే ఆ పత్రికకు ప్రకటనలు ఇవ్వాలని ఉత్తరుడు జారీ అయ్యాయని ప్రభుత్వ పెద్దలు చెప్తున్నారు. అయితే ఈ ఉత్తర్వులు ఇచ్చింది ఎవరు? వాటిపై సంతకాలు చేసింది ఎవరు.. సెక్రటేరియట్ బిజినెస్ రూల్స్ పాటించకుండా మౌఖిక ఆదేశాలతోనే కథ మొదలు పెట్టారా.. అనే అంశాలపై విజిలెన్స్ అధికారులు దృష్టి సారించినట్టు తెలుస్తోంది. ప్రాథమిక దర్యాప్తులోనే ఇంత వ్యవహార సాగితే.. ఇక తవ్వుతుంటే ఎన్ని విషయాలు తెలుస్తాయో చూడాల్సి ఉంది. మరి దీనిపైనైనా రేవంత్ రెడ్డి ప్రభుత్వం గట్టిగా దృష్టి సారిస్తుందా.. కెసిఆర్ ను ఫిక్స్ చేస్తుందా.. ఈ ప్రశ్నలకు కాలమే సమాధానం చెప్పాలి. ఒకవేళ ఈ కేసు కూడా కోల్డ్ స్టోరేజ్ లోకి వెళ్తే.. ఇకపై కేసీఆర్ పై రేవంత్ రెడ్డి ప్రభుత్వం పెట్టిన ఏ కేసు కూడా ముందుకు వెళ్లదనే అనుకోవాలి.

## ఒసాకా-కన్సాయ్ ఎక్స్‌పోకు సీఎం

-మొదటిపేజీ తరువాయి

పాల్గొననున్నట్లు సమాచారం. రాష్ట్రంలో పెట్టుబడి అవకాశాలను వివరించేందుకు ఒసాకా షోను వేదిక చేసుకోవాలని ప్రభుత్వం నిర్ణయించింది. గతంలో దావోస్ వెళ్లిన రెండు దఫాల్లోనూ దాదాపు రూ.2.20 లక్షల కోట్ల పెట్టుబడులకు సంబంధించి అవగాహన ఒప్పందాలు కుదుర్చుకున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. ఒసాకా ఉత్సవంలో ప్రధాన మంత్రి నరేంద్రమోదీ, వాణిజ్య శాఖ మంత్రి పీయూష్ గోయల్ కూడా పాల్గొంటారని సమాచారం. తెలంగాణలో ప్రభుత్వం ఏయే రంగాలకు ఎలాంటి ప్రోత్సాహకాలను అందిస్తుంది? ఇక్కడ ఉన్న పెట్టుబడి వాతావరణం, స్కిల్డ్, అన్‌స్కిల్డ్ లేబర్‌తోపాటు, విద్యుత్, నీటి సరఫరా, భూముల కేటాయింపు, అనుమతులు, రాయితీలు తదితర అంశాలపై రాష్ట్ర బృందం ప్రధానంగా దృష్టి పెట్టనున్నట్లు తెలిసింది. గతంలో రాష్ట్రం నుంచి ఇలాంటి షోకేస్ చేసే ప్రయత్నం జరగలేదని ఓ ఉన్నతాధికారి తెలిపారు. నేడు అహ్మదాబాద్‌కు సీఎం: సీఎం రేవంత్‌రెడ్డి మంగళవారం అహ్మదాబాద్ వెళ్లనున్నారు. మంగళ, బుధవారాల్లో అక్కడ జరిగే కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ, ఏఐసిసి సమావేశాల్లో పాల్గొనేందుకు ఉదయం ఆయన బయలుదేరి వెళ్లనున్నారు. ఈ సమావేశాల డ్రాఫ్ట్ కమిటీలో సభ్యులుగా ఉన్న ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి దామోదర్ రాజనర్సింహ, వంశీచంద్‌రెడ్డి ఇప్పటికే అహ్మదాబాద్ చేరుకున్నారు. కేంద్ర ఎన్నికల కమిటీ సభ్యుడి హెూదాలో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి కూడా ఈ సమావేశాల్లో పాల్గొంటారు. బుధవారం జరిగే ఏఐసిసి సమావేశానికి రాష్ట్రం నుంచి ఏఐసీసీలో ప్రాతినిధ్యం వహిస్తున్న 41 మందితోపాటు ప్రత్యేక ఆహ్వానితులుగా రాష్ట్ర మంత్రులు, ఇతర నేతలు హాజరుకానున్నారు. వీరంతా మంగళవారం అహ్మదాబాద్ బయలుదేరుతున్నారు.

## తెలంగాణ రాష్ట్రంలో వచ్చే మూడు రోజులు వర్షాలు..

-మొదటిపేజీ తరువాయి

మహబూబ్‌నగర్, మేడ్చల్, మల్కాజ్‌గిరి, నాగర్‌కర్నూల్, రంగారెడ్డి, సిద్ధిపేట, వికారాబాద్ జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉంది. లంగాణ రాష్ట్రంలో వచ్చే మూడు రోజులు వర్షాలు కురిసే అవకాశం ఉంది. ఈ విషయాన్ని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. దక్షిణ మధ్య బంగాళఖాతంలో ఏర్పిడిన అల్పపీడం కారణంగా ఉరుములు, మెరుపులతో కూడా వర్షాలు కురుస్తాయని సమాచారం. ఉపరితల ద్రోణి తూర్పు బీహార్ నుంచి ఈశాన్య జార?ండ్, ఛత్తీస్‌గఢ్ మీదుగా ఉత్తర తెలంగాణ వరకూ కొనసాగనుంది. దీని ప్రభావంతో హైదరాబాద్ నగరంలో సోమవారం మధ్యాహ్నం నుంచి వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. పలు ప్రాంతాల్లో చిరు జల్లులు కూడా కురిసాయి. మహబూబ్‌నగర్, మేడ్చల్, మల్కాజ్‌గిరి, నాగర్‌కర్నూల్, రంగారెడ్డి, సిద్ధిపేట, వికారాబాద్ జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉంది.

## తెలంగాణతో ఆర్థిక సంబంధాల బలోపేతంపై ఆసక్తి

-మొదటిపేజీ తరువాయి

చేసుకునేందుకు సింగపూర్ సంస్థలు ఆసక్తిగా ఉన్నాయని, డిప్యూటీ సీఎం సహకారం, సందేశం కావాలంటూ పాంగ్ కోరారు. గ్రీన్ ఎనర్జీ , రీజినల్ రింగ్ రోడ్డు, మూసి పునర్జీవనం, విద్య తమ ప్రభుత్వ ప్రాధాన్యత రంగాలని ఈ రంగాల్లో సింగపూర్ సంస్థలతో కలిసి పని చేసే అంశంపై చర్చించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఆసక్తిగా ఉందని డిప్యూటీ సీఎం తెలిపారు. కొత్త గ్రీన్ పవర్ పాలసీలో భాగంగా సోలార్, హైడ్రో, పంపుడ్ స్టోరేజీ విభాగాలపై దృష్టి పెట్టినట్టు డిప్యూటీ సీఎం తెలిపారు. ఇంటర్నేషనల్ స్టాండర్డ్స్ తో రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాల్లో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ నిర్మిస్తున్నట్టు సింగపూర్ ప్రతినిధి బృందానికి వివరించారు. మొదటి దశలో 6,00 కోట్లు కేటాయిస్తూ ఉత్తర్వులు విడుదల చేశామని, ప్రతి పాఠశాలను 25 ఎకరాల విస్తీర్ణంలో నిర్మిస్తున్నాము ఇది రాష్ట్ర ప్రభుత్వ డ్రీమ్ ప్రాజెక్టు అని వివరించారు. తెలంగాణ రాష్ట్రం ఒక నగర రాజ్యం, అత్యధికంగా పట్టణాలు ఉన్నాయని పట్టణ అభివృద్ధి పైన రాష్ట్ర ప్రభుత్వం దృష్టి పెట్టినట్టు తెలిపారు. సమావేశంలో సింగపూర్ పొలిటికల్ కాన్సుల్ వైష్ణవి వాసుదేవన్, సింగపూర్ హై కమిషన్ ప్రథమ ఆర్థిక సెక్రటరీ, డిప్యూటీ సీఎం స్పెషల్ సెక్రటరీ కృష్ణ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ సభకు 3 వేల బస్సులు

-మొదటిపేజీ తరువాయి

నియోజకవర్గాలవారీగా ముఖ్య నాయకులు, క్రియాశీల కార్యకర్తలతో సమావేశాలను ఈ నెల 12వ తేదీలోగా పూర్తి చేయాలని ఆదేశించారు. పార్టీ ఇచ్చే ప్రచార సామగ్రిని క్షేత్ర స్థాయికి చేరవేసేలా ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని కోరారు. పార్టీ కండువాలు, జెండాలు, వాల్ పోస్టర్లు తదితర ప్రచార సామగ్రి పంపిణీ త్వరలో ప్రారంభమవుతుందని చెప్పారు. ‘స్వరాష్ట్రాన్ని సాధించాం.. సగర్వంగా నిలబెట్టాం’నినాదంతో ‘ఛలో వరంగల్’పేరిట రూపొందించిన రజతోత్సవ బహిరంగ సభ పోస్టర్‌ను ఒకటిరెండు రోజుల్లో కేటీఆర్ ఆవిష్కరించనున్నారు.

**నేడు ‘గ్రేటర్’నేతలతో సమావేశం**

గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని బీఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకుల సమావేశం మంగళవారం ఉదయం 10.30కు తెలంగాణ భవన్‌లో జరగనుంది. మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ఈ భేటీని సమన్వయం చేస్తారు. సభకు గ్రేటర్ హైదరాబాద్ పరిధి నుంచి జన సమీకరణపై ఈ సమావేశంలో చర్చిస్తారు. గ్రేటర్ పరిధిలోనే బీఆర్ఎస్‌కు ఎక్కువ మంది ఎమ్మెల్యేలు ఉండటంతో జన సమీకరణను పార్టీ ప్రతిష్టాత్మకంగా తీసుకుంటోంది.

# కమలదళంలో కోల్డ్ వార్

**హైదరాబాద్ :** “రాజాసింగ్‌కు ఎవరూ సాటిలేరు.. ఆయన హిందూ ధర్మానికి ఆదర్శం. సర్వం హిందూ ధర్మం కావాలన్నదే రాజాసింగ్ లక్ష్యం”. ఈ మాటలు అన్నది మరెవరో కాదు. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్. సడెన్‌గా బండి అంతలా రాజాసింగ్‌ను ఎందుకు పొగడాల్సి వచ్చింది? హైదరాబాద్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల ముందు.. శ్రీరామనవమి శోభాయాత్రకు ముందు.. రాజాసింగ్‌ను బండి సంజయ్ ఎందుకు ఆకాశానికి ఎత్తారు? ఏదైనా వ్యూహం దాగుందా? మరెవరిపైనైనా మైండ్ గేమ్ ఆడారా? అనే చర్చ నడుస్తోంది.ఈమధ్య గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ రెచ్చిపోతున్నారు. కిషన్‌రెడ్డి టార్గెట్‌గా తూటాల్లాంటి మాటలు వదులుతున్నారు. బీజేపీ పెద్ద లీడర్ ఓ మేకప్‌మేన్ అని.. అతని టేబుల్ సాఫ్ చేసే వాళ్లకే పదవులు ఇస్తున్నారంటూ సంచలన కామెంట్స్ చేశారు. గౌతమ్‌రావును ఎమ్మెల్సీ కేండిడేట్‌గా ఎంపిక చేయడంపై రాజాసింగ్ కస్సుమన్నారు. అన్నిపదవులు మీవాళ్లకేనా? బీజేపీలో సీనియర్లు, కార్యకర్తలు లేరా? అంటూ కిషన్‌రెడ్డిపై డైరెక్ట్ అటాక్ చేశారు. ఇక, స్టేట్ బీజేపీ అధ్యక్షుడి ఎంపికపైనా తరుచూ కాంట్రవర్సీ కామెంట్స్ చేస్తుంటారు. ముఖ్యమంత్రులతో బ్యాక్ డోర్ పాలిటిక్స్ చేసే వారికి కాకుండా.. నిఖార్సైన కాషాయ లీడర్లకు, ప్రజల కోసం పోరాటం చేసే వారికే ప్రెసిడెంట్ పోస్ట్ ఇవ్వాలంటూ రచ్చ రాజేస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో తనపై పీడీ యాక్ట్ పెట్టి జైల్లో పెట్టడం వెనుకా.. తమ పార్టీ పెద్దలే ఉన్నారని కూడా కాంట్రవర్సీ కామెంట్స్ చేశారు. ఇలా రెగ్యులర్‌గా కమలం పార్టీలో కలకలం రేపే రాజాసింగ్‌కు బండి సంజయ్ లాంటి బిగ్ లీడర్ సరిలేరు నీకెవ్వరూ అనే రేంజ్‌లో కితాబు ఇవ్వడం బీజేపీలో ఆసక్తిగా మారింది.

శ్రీరామనవమి సందర్భంగా ఆదివారం పాతబస్తీలో వేలాదిమందితో భారీ శోభయాత్ర చేపట్టారు రాజాసింగ్. ప్రభుత్వం పర్మిషన్ ఇచ్చినా ఇవ్వకున్నా.. శోభయాత్ర విషయంలో తగ్గేదేలే అని తేల్చి చెప్పారు. శాంతిభద్రతల సమస్యంటూ పోలీసులు టెన్షన్ పడుతున్నారు. పార్టీ తరఫున రాజాసింగ్‌కు ఎలాంటి సపోర్ట్ లేకున్నా.. ఆయన తన సొంత ఇమేజ్‌తో పాతబస్తీలో మజ్లిస్ పార్టీ ముందు తొడగొట్టాలని చూస్తున్నారు. జై శ్రీరాం.. జై బీజేపీ.. జై యోగి.. జై మోదీ నినాదంతో రాజాసింగ్ ఓల్డ్ సిటీ హీరోగా నిలుస్తున్నారు. ఆయనలోని కరుడుగట్టిన హిందుత్వ భావాజాలం వల్లే.. రాజాసింగ్‌ను పార్టీ అధిష్టానం సైతం ఏమీ అనలేక పోతోంది. లేదంటేనా.. కిషన్‌రెడ్డి ఎప్పుడో తొక్కేసేవారని పార్టీ వర్గాలే అంటున్నాయి. గతంలో ముస్లింలపై ఓ కాంట్రవర్సీ కామెంట్ చేయగా.. ఆయన్ను పార్టీ నుంచి



కొన్ని నెలలు సస్పెండ్ చేశారు. ఎన్నికల ముందు మళ్లీ కాషాయ టికెట్ ఇచ్చి.. పాతబస్తీలో బీజేపీకి రాజాసింగ్ మినహా మరెవరూ దిక్కులేరని చెప్పకనే చెప్పారు. అలా సోలోగా ఎదిగి.. బండి సంజయ్‌తో సో బెటర్ లీడర్ అనిపించుకునే స్థాయికి చేరారు రాజాసింగ్. బండి సంజయ్ కావాలనే రాజాసింగ్‌ను ప్రమోట్ చేస్తున్నారా? అనే డౌట్ కూడా లేకపోలేదు. తెలంగాణ బీజేపీలో తీవ్ర వర్గపోరు నడుస్తోందనేది ఓపెన్ సీక్రెట్. కిషన్‌రెడ్డి, ఈటల రాజేందర్, రఘునందన్‌రావు లాంటి వాళ్లు ఓ టీమ్ అంటారు. బండి సంజయ్, ధర్మపురి అర్వింద్, రాజాసింగ్ తదితరులు మరో వర్గంగా ముద్ర పడ్డారు. బండి సంజయ్ తరఫున రాజాసింగ్ గట్టిగా మాట్లాడుతుంటారు. అసలే ఫైర్ బ్రాండ్ లీడర్ కావడంతో ఆయన నోటికి కంట్రోల్ ఉండదు. కిషన్‌రెడ్డి మెతక లీడర్ అని.. ఆయన అధ్యక్షుడిగా ఉంటే తెలంగాణలో బీజేపీ బలపడే ఛాన్సే లేదని గతంలోనే రాజాసింగ్ రచ్చ చేశారు. తాజాగా, అధ్యక్ష మార్పు ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో రాజాసింగ్ మళ్లీ యాక్టివ్ అయ్యారు. బండి సంజయ్‌కు అనుకూలంగా స్టేట్‌మెంట్స్ పాస్ చేస్తున్నారు. అటు, కిషన్‌రెడ్డి మాత్రం ఈటల రాజేందర్‌కు కిరీటం కట్టబెట్టాలని గట్టిగా ట్రై చేస్తున్నారట. ఇలాంటి సందర్భంలో కిషన్‌రెడ్డిని రాజాసింగ్ కార్నర్ చేస్తుండటం.. రాజాసింగ్‌కు ఎవరూ సాటిలేరు అంటూ బండి సంజయ్ అతన్ని పొగుడుతుండటంతో.. కాషాయ దళంలో కలకలం నెలకొంది.

# సంపాదకీయం

## వ్యాధులకు మూలం పోషకాహార లోపం

ఈరోజుల్లో అన్నం విలువ కొంత మందికే తెలుస్తుంది. ఎందుకంటే అన్నం తినేవాడి కన్నా దానిని పండించే వారికే దాని విలువ తెలుస్తుంది. ఆహారం పారేయడానికి ఒక్క నిమిషం చాలు, కాని ఆ ఆహారాన్ని పండించడానికి కనీసం మూడు నెలలు పడుతుంది. ఆ విషయం తెలియక చాలా మంది దానిని వృధా చేస్తారు. దీనికి సంబందించే అంటే ఆహార భద్రతను దృష్టిలో పెట్టుకొని ఈరోజున ప్రపంచ వ్యాప్తంగా ప్రపంచ ఆహార దినోత్సవం జరుపు కుంటారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవం ప్రతి సంవత్సరం ఏప్రిల్ 7న ప్రపంచ ఆరోగ్య సంస్థ(ఔనూ), ఇతర సంబంధిత సంస్థల ప్రాయోజకత్వంలో జరుపుకునే ప్రపంచ ఆరోగ్య అవగాహన దినం. 1948లో, ఔనూ మొదటి ప్రపంచ ఆరోగ్య సభను నిర్వహించింది. 1950 నుండి ప్రపంచ ఆరోగ్య దినోత్సవంగా ప్రతి సంవత్సరం ఏప్రిల్ 7 ను జరుపుకోవాలని అసెంబ్లీ నిర్ణయించింది. ఔనూ స్థాపనకు గుర్తుగా ప్రపంచ ఆరోగ్య దినోత్సవం జరుగుతుంది. ప్రతి సంవత్సరం ప్రపంచ ఆరోగ్యానికి ప్రధాన ప్రాముఖ్యత ఉన్న అంశంపై ప్రపంచవ్యాప్త దృష్టిని ఆకర్షించేటట్లు ఈ సంస్థ చూస్తుంది. ప్రతి ఏటా 150 కంటే ఎక్కువ దేశాలలో ఆహార దినం పాటిస్తున్నారు. ఒకరు రోజంతా కష్టపడి కూలి పనులు చేసి డబ్బు సంపాదిస్తారు. ఇంకొకరు రోజంతా ఏసీ గదుల్లో కంప్యూటర్ల ముందు కూర్చొని కుస్తీ పడతారు. ఎవరు ఎలా కష్టపడినా... కడుపు నింపు కోవడానికే. కోటి విద్యలు కూటి కోరకే... అని మన పెద్దలు ఎప్పుడో చెప్పారు. ముందు కడుపు నిండాకే మనిషి మరో దాని గురించి ఆలోచిస్తున్నాడు. ప్రస్తుతం కనీస అవసరాల కిందకి చాలా వచ్చాయి. ఎన్ని ఆ జాబితాలో చేరినా మొదటి స్థానంలో ఆహారమే ఉంటుంది. ఎందుకుంటే... ఆహారం లేకుండా సృష్టిలో ఏ ప్రాణి జీవించలేదు కాబట్టి. కానీ ప్రస్తుత రోజుల్లో మనుషులు లక్షల రూపాయలు సంపాదిస్తున్నా కూడా కడుపు నిండా భోజనం చేయడం లేదు. బరువు పెరుగు తామనో, లావు అయి పోతామనో ఇలా కారణాలు చెబుతున్నారు. కొందరేమో తినడానికి తిండి లేక అవస్తలు పడుతున్నారు. ఈ రెండు కారణాల వల్ల పోషకాహార లోపాన్ని ఎదురు కుంటున్న వారు చాలా మంది ఉన్నారు. ఈ రోజు ప్రపంచ ఆహార దినోత్సవం. ఈ సందర్భంగా ఎలాంటి ఆహారం తినాలనే విషయాలపై అవగాహన అవసరం. ప్రతి ఒక్కరికీ ఆరోగ్యకరమైన ఆహారాన్ని ఈ ఆహార దినోత్సవం సందర్భంగా ఎలాంటి జబ్బుల బారిన పడకుండా ఉండేందుకు అవసరమైన ఆహారం తీసుకోవాలి. పండ్లు, కూరగాయలు, పప్పు ధాన్యాలతో పాటు గింజలు, విత్తనాలు, పల్లీలు, శనగలు, ఉలవలు, బొబ్బర్లు, జీడిపప్పు, బాదం పప్పు, వాల్ నట్స్ వంటిని ప్రతి రోజూ తీసుకోవాలి. భారతీయులు రోజూ కనీసం 400గ్రాముల కూరగాయలు, పండ్లు తీసుకోవాలని భారత పోషకాహార సంస్థ చెబుతోంది. రాగులు, జొన్నలు, వరి, గోధుమ వంటి ధాన్యాన్ని కూడా ఎక్కువగా తీసుకోవాలి. మరీ ప్రత్యేకంగా కొవ్వులు, చెక్కర, ఉప్పు వాడకాన్ని చాలా తక్కువగా వాడటం ఉత్తమం. 50శాతం కేలరీలు అందిస్తున్న పంటలు 8 రకాలు ఉన్నాయి. బార్లీ, బీన్స్, వేరుశెనగ, మొక్కజొన్న, వరి, జొన్న, గోధుమలు వీలైనంత ఎక్కువగా ఆహారంలో భాగం చేసుకోవాలి. బయట లభించే ఆహారాలకు ఎంత దూరంగా ఉంటే అంత మంచిదని నిపుణులు చెబుతున్నారు. ఫాస్ట్ ఫుడ్ అసలు తినకపోవడం చాలా మంచిది. చిన్నారులకు కనీసం 9నెలల వరకు తల్లిపాలు ఇవ్వాలి. పుట్టగానే డబ్బా పాలను అలవాటు చేస్తే.. అప్పటి నుంచే వారిలో పోషకాహార లోపం తలెత్తే అవకాశం ఉందని హెచ్చరిస్తున్నారు. పోషకాహారం తీసుకోవడంతో పాటు తగినంత వ్యాయామం చేయడం కూడా చాలా అవసరం. మన భూమి మీద మనిషి తినగలిగే మొక్కల జాతుల సంఖ్య దాదాపు 30వేలు ఉన్నాయని నిపుణులు చెబుతున్నారు. ప్రపంచ వ్యాప్తంగా 852 మిలియన్ల మంది దీర్ఘకాలంగా అతి పేదరికం కారణంగా ఆకలితో అలమటిస్తున్నారు. ఈ సంఖ్య నిరంతరం పెరుగుతూనే ఉంది. అందుకు కారణాలు అనేకం. విపరీతమైన జనాభా పెరుగుదల, వాతావరణ మార్పు, ఆహార ధాన్యాలను జీవ ఇంధనాల కోసం ఉపయోగించడం, మౌలిక ఆహార ధాన్యాల ఉత్పత్తి తగ్గించి లాభదాయకమైన వాణిజ్య పంటలవైపు మొగ్గుచూపడం... ఇలా ఎన్నో కారణాలు. వీటి పర్యవసానంగా ఆహార ధాన్యాల ధరలు అందుబాటు లోకి లేనంతగా పెరగడం మరో సమస్య. ప్రపంచ జనాభాలో దాదాపు సగం పట్టణాలు, నగరాలలో జీవిస్తున్నారు. అభివృద్ధి చెందుతున్న దేశాలలో 70 శాతం కంటే ఎక్కువ మంది పల్లెల్లో నివసిస్తున్నారు. అయినా అనేక కారణాలవల్ల వ్యవసాయం కుంటుపడింది. ఆఫ్రికాలో కొన్ని దేశాలలో కరువు నిత్యం తాండవిస్తూనే ఉంది. ఆసియాలో దాదాపు 60 శాతం జనాభా పోషకాహార లోపంతో బాధపడుతున్నారు. అదే ఆఫ్రికాలో ఆ శాతం 75 దాటింది. దాదాపు 22 దేశాలలో (వాటిలో 16 ఆఫ్రికాలోవే) పోషకాహార లోపం 35 శాతం దాటిందని తేలింది. భారతావనిలో విస్తారమైన కోట్లాది ఎకరాల భూములుండి, లక్షలాది ఎకరాల పంట భూములలో పప్పు ధాన్యాలు, తదితర ఆహార ధాన్యాలతో విలసిల్లింది. ఆహార ధాన్యాల ఉత్పత్తిలో అగ్రగామిగా నిలిచిన మనదేశం స్వాతంత్యం వచ్చి ఏడు దశాబ్దాలు దాటినా, పాలకుల పేదరిక నిర్మూలనా పథకాలు, లక్షల, కోట్ల పంచ వర్ష ప్రణాళికలు ఈ ఏడు దశాబ్దాల్లో పేదరికం ఆకలి తీర్చలేదు. పేదలు దరిద్రులుగా, ధనికులు బిలియనీర్లు, ట్రిలియనీర్లు కావటానికి ఉపయోగపడ్డాయి తప్ప, సగటు మనిషి ఆకలి తీర్చటంలో విఫలమయ్యాయి. దేశ స్థూల జాతీయాదాయం చూపి చంకలు గుద్దుకుంటున్న పాలకులు జాతీయాదాయంతో పాటు, జాతులకు ఆహార భద్రత కల్పించటంలో విఫలమయ్యారు. దీనికి ఉదాహరణ పనికి ఆహార పథకంలో అవినీతి, పేదలకిచ్చే సబ్సిడి ఆహార భద్రత కార్డుల్లో అవినీతి, ఆహార అవసరాలు తీర్చుట గురించి అవకాశం కల్పించినా రైస్‌మిల్లర్ల మాయాజాలం వెరసి అవినీతి ఎందెందు వెతికినా అందందు కలదన్నట్టు అవినీతి బీజాలు మహావృక్షాలై పాలకుల ప్రజాస్వామ్య వ్యవస్థను వెక్కిరిస్తున్నాయి. వ్యవసాయ రంగానికి ఒక సమగ్ర విధానమంటూ లేకపోవటంతో వ్యవసాయాన్ని సమాధిచేసి, ఉన్న వ్యవసాయంలో వాణిజ్య పంటలను ప్రోత్సహించింది. ప్రపంచ వేదికల్లో గొప్పలకు పోయే మన పాలకుల ఏలికలు వాస్తవ పునాదులపై నిలబడి, మాటల్లో కాకుండా ఆచరణతో కూడిన ఆహార భద్రత పరిష్కారానికి పూనుకోవాలి. అదే జాతీయ ప్రయోజనాలకు,జాతి ప్రయోజనాలకు శ్రేయస్కారం.

# వ్యక్తిత్వానికి మచ్చుతునక భగత్ సింగ్



1929 ఏప్రిల్ 8 తేదీన ప్రజారక్షణ, వ్యాపార వివాదల చట్టాల ఆమోదానికి నిరసనగా భగత్ సింగ్, బతుకేస్వర్ దత్‌తో కలిసి కేంద్రీయ విధాన సభ లోకి బాంబులు విసిరారు. భగత్ సింగ్ (1907 సెప్టెంబరు 28 - 1931 మార్చి 23) భారత స్వాతంత్ర్య సమర యోధుడు, కరుడుకట్టిన ఉద్యమ కారుడు. ఢిల్లీ వీధిలో ఎర్ర కాగితాలు చల్లి ప్రజలను చైతన్యపరిచాడు. విప్లవం వర్ధిల్లాలి అనే నినాదాన్ని ఇచ్చింది కూడా భగత్ సింగే. భారత స్వాతంత్ర్యోద్యమములో పోరాడిన అత్యంత ప్రభావశీల విప్లవ కారులలో ఆయన ఒకడు. ఆ కారణంగానే షహీద్ భగత్ సింగ్ గా నేటికీ కొనియాడబడుతున్నాడు. భగత్ సింగ్ పూర్వపు పంజాబ్‌లో, ప్రస్తుత పాకిస్తాన్‌లో ఉన్న లాయల్ జిల్లా బంగా సమీపంలోని ఖత్కర్ కలాన్ గ్రామంలోని సంధు ఝాట్ కుటుంబంలో సర్దార్ కిషన్ సింగ్ , విద్యావతి దంపతులకు జన్మించాడు. భగత్ అనే పదానికి "భక్తుడు" అని అర్థం. భగత్ సింగ్ మూడేళ్ళ పిల్లాడిగా ఉన్నప్పుడు తండ్రి కిషన్ సింగ్, భగత్ సింగ్‌ను చంకకెత్తుకొని, కొత్తగా వేస్తున్న తోటను చూడ్డానికి పొలాల్లోకి వెళ్ళాడు. వెంటనే కిందికి దిగిన భగత్ సింగ్ ఆ మట్టిలో ఆడుకుంటూనే చిన్న చిన్న గడ్డిపరకలను నాటడం మొదలు పెట్టాడు. తండ్రి "ఏం చేస్తున్నావ్ నాన్నా" అని ప్రశ్నిస్తే, భగత్ సింగ్ 'తుపాకులు నాటుతున్నా' అని బదులిచ్చాడు. భవిష్యత్తుకు బాల్యం మొలకలు వేసే వయస్సులో తుపాకులను మొలకెత్తించాలని చూడడం ఆయన వ్యక్తిత్వానికి మచ్చుతునక. 13 ఏళ్ల ప్రాయంలోనే మహాత్మా గాంధీ సహాయ నిరాకరణో ద్యమానికి సింగ్ ప్రభావితుడ య్యాడు. ఆ సమయంలో బ్రిటీష్ ప్రభుత్వానికి ఎదురుతిరిగిన భగత్ ప్రభుత్వ పాఠశాల పుస్తకాలు, బ్రిటీషు దిగుమతి దుస్తులను తగులబెట్టడం ద్వారా గాంధీ సిద్ధాంతాలను అనుసరించాడు. లాలా లజ్‌పత్ రాయ్ మరణం, సాండర్స్ హత్యల తరువాత 1928 లో భారత్‌లోని వర్ధమాన రాజకీయ పరిస్థితిపై నివేదికను కోరుతూ సర్ జాన్ సైమన్ నేతృత్వంలో బ్రిటీష్ ప్రభుత్వం ఒక కమిషన్‌ను ఏర్పాటుచేసింది. భారత దేశానికి వచ్చిన సైమన్ కమిషన్లో ఒక్క భారతీయుడైనా లేనందుకు నిరసనగా, ఉద్యమంలో లాల్‌జీ కీలక పాత్ర వహించి, సైమన్ కమిషన్‌ను బహిష్కరించాలి అంటూ పంజాబ్ అసెంబ్లీలో ఆయన తీర్మానం పెట్టి గెలిపించారు. ఇది ప్రభుత్వానికి కంటగిం పుగా మారింది. అక్టోబర్ 30, 1928న ఆ కమిషన్ లాహోర్ రాగా, లాల్‌జీ కూడా అహింసతో, మౌనం గా సైమన్ వ్యతిరేక కార్యక్రమాన్ని నిర్వహించారు. మౌనంగా ఉద్యమి స్తున్న వారిపైన కూడా లాఠీ చార్జికి ఆదేశించాడు పోలీసు సూపరింటెం డెంట్ జేమ్స్ ఏ స్కాట్. తను స్వయంగా లాల్‌జీ మీద దాడి చేసి, లాల్‌జీ ఛాతీ మీద లాఠీ తో స్కాట్ తీవ్రంగా కొట్టాడు. ఆ దెబ్బలతోనే లాల్‌జీ నవంబర్ 17న చని పోయారు. ఈ సంఘటనను కళ్లారా చూసిన భగత్ సింగ్ ప్రతీకారం తీర్చు కోవాలని నిర్ణయించు కున్నాడు. పోలీసు అధికారి స్కాట్‌ను హత మార్చడానికి విప్లవకారులు శివరామ్ రాజ్‌గురు, జై గోపాల్, సుఖ్‌దేవ్ థాపర్‌లతో ఆయన చేతులు కలిపాడు. అయితే పొరపాటు గుర్తింపు కారణంగా డీఎస్పీ జే. పీ. సాండర్స్ కనిపించినప్పుడు పొర పాటుగా స్కాట్ అనుకుని, జైగో పాల్ ఆయన్ను కాల్చమంటూ సింగ్‌కు సంకేతాలిచ్చాడు. ఫలితంగా స్కాట్‌కు బదులు సాండర్స్ హతమయ్యాడు. దాంతో పోలీసుల కంటపడకుండా ఉండటానికి భగత్ లాహోర్ పారిపోయాడు. గుర్తు పట్టకుండా ఉండటానికి గడ్డాన్ని గీసుకోవడం, వెంద్రుకలు కత్తిరించుకోవడం ద్వారా సిక్కు మత విశ్వాసాల ఉల్లంఘనకు సింగ్ పాల్పడ్డాడు. భగత్ సింగ్ వంటి విప్లవకారులను అణచివేయడం కోసం భారత రక్షణ చట్టమును తీసుకు రావడం ద్వారా పోలీసులకు బ్రిటీష్ ప్రభుత్వం మరింత అధికారం కల్పించింది. ఆ చట్టాన్ని వ్యతిరేకిస్తూ అది ఆమోదితం కానున్న కేంద్ర శాసనసభపై బాంబు పేలుడుకు హిందూస్తాన్ సామ్యవాద గణతంత్ర సంఘం వ్యూహరచన చేసింది. బాంబు పేలుడుకు భగత్ సింగ్ ప్రయత్నించకుండా మరో ప్రముఖ విప్లవకారుడు చంద్రశేఖర్ ఆజాద్ అడ్డుకున్నాడు. అయితే సింగ్ ఆశయాలను అంగీకరించే విధంగా మిగిలిన పార్టీ సభ్యులు ఆయనపై ఒత్తిడి తీసుకొచ్చారు. శాసనసభ వసారాపై భగత్ సింగ్‌తో పాటు మరో విప్లవకారుడు 8 ఏప్రిల్ 1929న సింగ్, దత్‌లు బాంబు విసిరి, "ఇంక్విలాబ్ జిందాబాద్ అని నినదిస్తు పలు కరపత్రాలను వెదజల్లారు. కేంద్ర అసెంబ్లీ ఆవరణలో కరపత్రం విసిరివేత, బాంబు దాడి వల్ల ఏ ఒక్కరూ మరణించడం గానీ గాయపడటం గానీ జరగలేదు. తమ వ్యూహంలో భాగంగా ఉద్దేశ్యపూర్వకంగానే జాగ్రత్తలతో దాడి చేసినట్లు సింగ్, దత్ అంగీకరించారు. బాంబు గాయపరిచేటంత శక్తివంతమైంది కాదని బ్రిటీష్ ఫోరెన్సిక్స్ విచారణాధికారులు కూడా తేల్చిచెప్పారు. వాస్తవానికి బాంబు జనాలకు దూర బాంబు దాడి తర్వాత సింగ్, దత్ ఇద్దరూ లొంగిపోయారు. సింగ్ అరెస్టు అనంతరం శాసనసభ పేలుడుపై విచారణ నేపథ్యంలో జే. పీ. సాండర్స్ హత్య వెనుక ఆయన హస్తంపై బ్రిటీష్ ప్రభుత్వం ఆరా తీసింది. హత్యకు సంబంధించి భగత్ సింగ్, రాజ్‌గురు , సుఖ్‌దేవ్‌లపై అభియోగాలు మోపారు. భారత స్వాతంత్ర్యానికి తన గళాన్ని వినిపించుకునేందుకు న్యాయస్థానాన్నే ఒక ప్రచార వేదికగా మలుచుకోవాలని భగత్ సింగ్ నిర్ణయించుకున్నాడు. హత్యా నేరాన్ని అంగీకరించిన ఆయన విచారణ సమయంలో బ్రిటీష్ పాలనకు వ్యతిరేకంగా ప్రకటనలు చేశాడు. ఫిరోజ్ పూర్లో బ్రిటిష్ పోలీసు అధికారి జె.పి.సాండర్స్ ను హత మార్చి నందుకు గాను వారికి 1930లో అక్టోబర్ 7వ తేదీని ఈ మరణ శిక్షను ఖరారు చేశారు. భగత్ సింగ్ సహా ముగ్గురికి ఉరిశిక్ష ఖరారు చేసిన తీర్పు వివరాలను 2015లో ప్రచురించారు. ఝొతీతీఖ్త్ శీట జుఇవఝబ్అశీఅ ాఅ ావత్వఅఎవ ాట ఐఘ్ష్త్ర అనే విడుదల చేసిన పత్రంలో 1930 అక్టోబర్ 7వ తేదీన ఉరిశిక్ష విధిస్తూ తీర్పిచ్చినట్లు స్పష్టంగా ఉంది. 1931, మార్చి 23న ఉరిశిక్ష అమలు చేసినట్లు మరో పత్రంలో వివరాలు ఉన్నాయి.

# ప్రజా సమస్యలను వెలికి తీసిన చైతన్యయాత్ర



విశాలమైన సముద్రతీర ప్రాంతం, అపారమైన ప్రకృతి వనరులు, పరిశ్రమలకు, వాణిజ్యానికి అన్నింటా అనువుగా ఉండే ప్రాంతం కాకినాడ జిల్లా. కాని ప్రజలకు కనీస అవసరాలు కూడా తీర్చలేని స్థితిలో ప్రభుత్వాల పాలన సాగుతోంది. మార్చి 7 నుంచి రెండు రోజుల పాటు సిపిఎం నిర్వహించిన ప్రజా చైతన్య యాత్రలో ప్రజలు ఏకరువు పెట్టిన సమస్యలే దీనికి నిదర్శనం. రాష్ట్రంలో మొట్టమొదటిగా సిపిఎం ప్రజాచైతన్య యాత్ర కాకినాడ జిల్లా నుంచి ప్రారంభమైంది. సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావుతో పాటుగా రాష్ట్ర కేంద్రం నుంచి ఎం.హరిబాబు, కాకినాడ జిల్లా కార్యదర్శి కరణం ప్రసాద్ సహా 20 మంది, జిల్లా కమిటీ సభ్యులు, కార్మికులు సైకిల్ యాత్రలో భాగంగా ఊరూరా తిరిగి సమస్యలను పరిశీలించారు. సుందరయ్య భవన్ నుంచి మొదలైన యాత్ర జగన్నాథపురం వంతెన మీదుగా తూరంగి డ్రైవర్స్ కాలనీకి చేరుకుంది. కాలనీవాసులు మంచినీటి సమస్యపై పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావుకు వినతిపత్రం అందించారు. తమకు సరఫరా అయ్యే మంచినీటి ట్యాంక్ క్లీనింగ్, నీటి సరఫరా అధ్వాన్నంగా ఉందని తెలిపారు. నెలకు రూ.1000 నుంచి రూ.1,200 మంచి నీటికే ఖర్చు చేయాల్సి వస్తుందన్నారు. అధికారులకు ఎన్నిసార్లు వినతి పత్రాలిచ్చినా సమస్య పరిష్కారం కావడం లేదని తెలిపారు. పగడాల పేట వద్ద మత్స్యకారులు యాత్ర బృందానికి తమ సమస్యలపై వినతి పత్రం ఇచ్చారు. సముద్రంలో చమురు కార్యకలాపాల నేపథ్యంలో వేట తగ్గిపోయిందని, కుటుంబ పోషణకు సరిపడా ఆదాయం రావట్లేదన్నారు. ఇతర మండలాల్లో మత్స్యకార కుటుంబాలకు ఇస్తున్న రీతిలో ఏడాదికి రూ.70 వేల నష్టపరిహారం ఇవ్వాలని, సర్వే చేసి మత్స్యకార కుటుంబాలను గుర్తించాలని కోరారు. కరప మండలం పగడాల పేట గ్రామానికి చెందిన మత్స్యకారులు, గ్రామ పెద్దలు, సొసైటీ నాయకులు యాత్ర బృందానికి వినతిపత్రం అందించారు. మార్కెట్లో వ్యాపారం చేసుకునే వారికి ఐస్ బాక్సుల కొనుగోలుకు రుణాలు వచ్చేలా చూడాలని కోరారు. అనంతరం యాత్ర గురజనాపల్లి సెంటర్ మీదుగా తాళ్ళరేవు మండలం చొల్లంగి గ్రామానికి చేరుకుంది. ఇళ్ల స్థలాల సమస్యపై గ్రామస్తులు వినతిపత్రం అందించారు. తమకు ఉపాధి దొరకడం లేదని ఉపాధి పనులు పెంచాలని మహిళా కూలీలు కోరారు. అనంతరం చొల్లంగి పేటలోని నర్సరీలో పనిచేస్తున్న ఉపాధి కూలీలు తమకు పనులు సరిపోవడం లేదని, వ్యవసాయ పనులు కూడా లేవని తెలిపారు. కూలి పెంచాలని కోరారు. యుపిఎ ప్రభుత్వంలో సిపిఎం భాగస్వామిగా ఉన్న కాలంలో ఉపాధి హామీ చట్టం తేవడానికి చేసిన కృషిని ఈ సందర్భంగా వివిఎస్ఆర్ వివరించారు. ఈ చట్టంపై జరుగుతున్న దాడిని తిప్పి కొట్టి, చట్టాన్ని రక్షించుకోవాలని పిలుపునిచ్చారు. అనంతరం చొల్లంగి పేటలోని కొబ్బరిచెట్టు పేట కాలనీని సందర్శించారు. అక్కడ కాలనీవాసులు డ్రెయిన్లు లేక ఇళ్ల దగ్గర నిలిచిపోయిన మరుగు నీటిని చూపించారు. మురుగుతో వ్యాధులు వస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. స్వచ్ఛ ఆంధ్ర అమలు ఇక్కడ కనిపించట్లేన్నారు. తమకు మూడు నెలలుగా కరెంటు బిల్లులు అధికంగా వస్తున్నాయని, వాడుకున్న కరెంటు యూనిట్ల కంటే 5 రకాలు చార్జీలు పేరుతో వేసిన బిల్లే ఎక్కువగా ఉందని జి.వేమవరం మహిళలు వాపోయారు. వంద యూనిట్లు వాడుకుంటే రూ.3,500 బిల్లు వచ్చిందిని తెలిపారు. కొత్తూరు ఎస్‌సి కాలనీలో పెద్దలతో, కొత్తూరు మహాలక్ష్మి గుడి ఆవరణలో మత్స్యకార పెద్దలతో బృందం సమావేశమైంది. 2024 వేట నిషేధ పరిహారం నేటికీ రాలేదని మత్స్యకారులు తెలిపారు. బోట్లకు రిజిస్ట్రేషన్ చేయించకపోవడంతో వేటకు వెళ్లే చాలా మంది పేర్లు నమోదు కాలేదని తెలిపారు. సొసైటీలకు ప్రభుత్వం ఇచ్చే సౌకర్యాలు పూర్తిస్థాయిలో అందించాలని వారు వినతిపత్రం అందించారు. పటవల గ్రామంలో కౌలు రైతులు వినతి పత్రం ఇచ్చారు. కౌలు రైతులకు పంట పెట్టుబడి సాయం ఇవ్వడం లేదని, కులం పేరున ఒసిలకు భరోసా ఇవ్వడం లేదని తెలిపారు. పాత కోరంగి వెళ్లడానికి నిర్మించిన రోప్ వే స్థానంలో పర్మినెంట్ బ్రిడ్జి నిర్మించాలని, ఆక్వా పరిశ్రమల కాలుష్య కారకాలు కోరంగి నదిలో కలిసి పాత కోరంగి పంట కాలువలోకి వచ్చి తమ పంట పొలాల్లో దిగుబడి తగ్గిపోతుందని, దీన్ని నివారించాలని గ్రామస్తులు కోరారు. ప్రతాప్ నగర్ కాలనీలో గ్రామ పెద్దలు మాట్లాడుతూ ఉపాధి లేక గ్రామంలో నిరుద్యోగులు పెరిగిపోతున్నారన్నారు. తాళ్లరేవు పంచాయతీ మాధవ రాముడు పేట శ్రీరామ నగర్‌లో మురుగునీటి పరిస్థితిని ప్రజలు బృందానికి చూపించారు. రెడ్డివారి పేట ప్రజలు బృందంతో మాట్లాడుతూ జల్ జీవన్ పథకం ద్వారా ఇంటింటికీ కొళాయిలు వేశారని, కాని వీటి నుంచి నేటికీ నీరు రాలేదని వాపోయారు. నీరు లేక ఎండిపోతున్న చేలను రైతులు బృందానికి చూపించారు. దశాబ్దాలుగా అన్ని కులాల వారు ఇక్కడ సాగు చేసుకుంటున్నారని, నేటికీ భూమిపై హక్కు పత్రాలు ఇవ్వలేదని రైతులు వాపోయారు. సాగునీటి కోసం తాళ్లరేవు ఇరిగేషన్ ఆఫీస్ దగ్గర రైతులు చేస్తున్న ఆందోళనకు ప్రజా చైతన్య యాత్ర బృందం మద్దతు తెలిపింది. సిపిఎం, కౌలు, రైతు సంఘం నాయకులు సాగునీటి కోసం వారం రోజులుగా చేస్తున్న ఆందోళనలను సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు దృష్టికి రైతులు తీసుకొచ్చారు. ఆయన అధికారులకు ఫోన్ చేసి సమస్యను వివరించారు. అనంతరం అధికారులు స్పందించారు. మోటార్లతో నీటిని తోడి చేలకు అందించే చర్యలు చేపట్టారు. నీలపల్లి పంచాయతీ సిద్ధార్థ నగర్ శ్మశాన సమస్యను పరిశీలించారు. మండలంలో సాగునీటి సమస్యకి కారణంగా వున్న ఇంజరంలోని ఆర్ అండ్ బి వంతెన నిర్మాణాన్ని పరిశీలించారు. కాలువపై అడ్డంగా నిర్మించిన చప్టా కారణంగా నీరు రావట్లేదని రైతులు బృందానికి తెలిపారు. తక్షణమే వంతెన నిర్మించాలని కోరారు. అనంతరం జార్జి పేట పంచాయతీ తూర్పు పేటలో కోరంగి కంపెనీ భూములు సమస్యపై ప్రజలు బృందానికి వివరించారు. తాళ్ళరేవు పంచాయతీ రచ్చవారిపేట మత్స్యకార గ్రామంలో సమస్యలను వివరించారు. కోరంగి కాలువలోకి ఆక్వా కంపెనీలు వ్యర్థాలను వదిలేస్తున్నాయని, దాంతో నీరు కలుషితమై కాలువలో చేపల వేటకు వీలు లేకుండా పోయిందన్నారు. కరప మండలం, కాజులూరు మండలాల్లోనూ ప్రజా చైతన్య యాత్రలు జరిగాయి. కరపలోని నక్క వారి పేటలో విషజ్వరాలు ప్రబలిన ప్రాంతంలో బృందం పర్యటించిది. ఇక్కడ వందకు పైగా దళితుల కుటుంబాలు నివాసం ఉంటున్నాయి. ఈ సమస్యలను పరిష్కరించాలని ఎంపిడిఒకు వినతిపత్రం అందించారు. కాజులూరు మండలం ఒంటితాడి గ్రామంలో మత్స్యకారుల కాలనీలో తీవ్ర తాగునీటి సమస్యను బృందం గుర్తించింది. స్థానిక సమస్యలపై సిపిఎం కృషి ప్రారంభమైంది. ఇది నిరంతర ప్రక్రియగా కొనసాగుతుంది. ప్రజలు కూడా ఇందులో భాగస్వాములైతే సమస్యలకు పరిష్కారం దొరుకుతుంది.

# అంగన్ వాడి కేంద్రంలో ఘనంగా అల్లు అర్జున్ జన్మదిన వేడుకలు





విద్యార్థులకు ప్లేట్లు,టిఫిన్ బాక్సులు పంపిణీ చేసిన రాష్ట్ర అధ్యక్షులు గడ్డం రవికుమార్

**రామంతాపూర్,ఏప్రిల్ 08** ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ జన్మదిన వేడుకలు హైదరాబాద్ రామంతాపూర్ పూర్ చర్చి కాలనీలోని అంగన్వాడీ కేంద్రంలో అల్లు అర్జున్ అభిమాన సంఘం రాష్ట్ర అధ్యక్షులు గడ్డం రవికుమార్ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా జరుపుకున్నారు. అంగన్వాడీ పాఠశాల విద్యార్థిని విద్యార్థులకు గడ్డం రవికుమార్ ప్లేట్లు,టిఫిన్ బాక్సులు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా గడ్డం రవికుమార్ మాట్లాడుతూ...పుష్ప 2 సినిమా అంతర్జాతీయంగా సక్సెస్ కావడం ఆనందంగా ఉందన్నారు. మునుముందు ఇలాంటి సక్సెస్ లో ఎన్నో అందుకోవాలని కోరుకున్నారు. అల్లు అర్జున్ జన్మదినోత్సవం సందర్భంగా రాష్ట్రంలో అనేక ప్రాంతాల్లో అభిమానులు అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో అల్లు అర్జున్ అభిమానులు సాయి, దేవేంద్రచౌదరి, నవీన్, మనోహర్, శివ, మహేష్, తదితరులు పాల్గొన్నారు.

# సన్న బియ్యం పథకం అమలు పేదలకు వరం






కాంగ్రెస్ నేతలు..

భారత రాజ్యాంగాన్ని అంబేడ్కర్‌ను కాపాడుకుందాం..

రామంతాపూర్‌లో జై బాపు,జై భీమ్,జై సంవిధాన్ అభియాన్ ర్యాలీ

**రామంతపూర్,ఏప్రిల్ 08(సూర్యరేఖ)** రాష్ట్రంలో అమలు చేస్తున్న సన్నబియ్యం పథకం పేదలకు వరంగా మారిందని పలువురు కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు.సీఎం రేవంత్‌రెడ్డి పేదల పక్షపాతిగా సన్న బియ్యం పథకాన్ని ప్రవేశ పెట్టి అమలు చేస్తున్నారని తెలిపారు.బిఆర్ అంబేద్కర్ ను అవమానించేలా పార్లమెంటులో హెూంమంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యలకు రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ జై బాపు,జై భీమ్,జై సంవిధాన్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా రామంతాపూర్‌లోని వెంకట్‌రెడ్డి నగర్‌లో ర్యాలీ నిర్వహించారు.ఉప్పల్ నియోజకవర్గం కో- ఆర్డినేటర్ శోభారాణి, నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మందుముల పరమేశ్వర్‌రెడ్డి ఈ సందర్భంగా మాట్లాడారు..భారత రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్‌ను,మన రాజ్యాంగాన్ని అవమానించే బీజేపీ,దాని అనుబంధ సంస్థలు దాడులు చేస్తున్నాయని గుర్తు చేశారు.ఈ దాడులను క్షేత్రస్థాయి నుంచే తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. భారత రాజ్యాంగాన్ని కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. రాజ్యాంగాన్ని కాపాడుకుంటూ అంబేడ్కర్‌ను గౌరవించాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు.రాష్ట్రంలో ఇందిరమ్మ రాజ్యంలో ప్రజాపాలన నడుస్తుందన్నారు.యువ వికాసం వంటి పథకాలు నిరుద్యోగులకు వరంగా మారుతాయన్నారు. అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డుల అందేలా ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు.ఈ కార్యక్రమంలో హబ్సిగూడ, రామంతాపూర్, చిల్కానగర్,ఉప్పల్ డివిజన్ సీనియర్ నాయకులు,కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

# అభివృద్ధి పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలి





## రామంతపూర్ కార్పొరేటర్ బండారు శ్రీవాణి వెంకట్రావు..

**ఉప్పల్,ఏప్రిల్ 08(సూర్యరేఖ)** అభివృద్ధి పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని రామంతపూర్ కార్పొరేటర్ బండారు శ్రీవాణి వెంకట్రావు అధికారులకు సూచించారు. మంగళవారం డివిజన్ పరిధిలోని ఇంద్రనగర్ లో జరుగుతున్న రూ.88 లక్షలతో సివరేజ్ పనులను కార్పొరేటర్ అధికారులతో కలిసి పరిశీలించారు.ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ...పనులలో ఎలాంటి జాప్యం లేకుండా నాణ్యతలో ఎలాంటి కాంప్రమైజ్ లేకుండా పనులను త్వరగా పూర్తి చేయాలని అధికారులను కోరారు. ప్రజలకు ఇబ్బంది కలుగకుండా త్వరగా పనులు పూర్తి చేయాలని ఎప్పటికప్పుడు పనులను పర్యవేక్షించాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో బండారు వెంకట్రావు,జలమండలి మేనేజర్ రవీందర్,వాటర్ వర్క్స్ సూపర్వైజర్ కిషన్, బిజెపి నాయకులు పడిగం నాగేష్, తదితరులు పాల్గొన్నారు.

## సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి..

నిజాంపేట ఎస్ఐ బండి రాజేష్




**నిజాంపేట,ఏప్రిల్08(సూర్యరేఖ)** మండల ప్రజలు సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని నిజాంపేట ఎస్ఐ బండి రాజేష్ అన్నారు.ఈ సందర్భంగా ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ...ప్రతి ఒక్కరూ సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని,సైబర్ క్రైమ్ కు గురైనట్లయితే 1930 కు కాల్ లేదా పోలీస్ స్టేషన్ ను సంప్రదించాలన్నారు. రోడ్డు ప్రమాదాలు జరగకుండా తగిన జాగ్రత్తలు చేపట్టాలని రోడ్డు ప్రయాణం చేసేటప్పుడు తప్పకుండా సీట్ బెల్ట్,హెల్మెట్ ధరించాలన్నారు. రోడ్డు ప్రమాదాలు జరిగినట్లయితే తప్పకుండా 100కు డయల్ చేసి పోలీసులకు సమాచారం అందించాలని ప్రమాదానికి గురైన వారి నిండు ప్రాణాలను కాపాడాలన్నారు.మండలంలో ప్రజలకు ఏమైనా సమస్యలు ఉన్నట్లయితే పోలీస్ స్టేషన్ ను ఆశ్రయించాలన్నారు.మండలంలో యువత చెడు వ్యసనాలకు పాల్పడకుండా ఉండాలని సైబర్ క్రైమ్ నేరాలు ఆన్ లైన్ బెట్టింగులు చేసి ఆత్మహత్యలకు పాల్పడద్దని తల్లిదండ్రుల కడుపు కోత విధించొద్దన్నారు.మండలంలో అసాంఘిక కార్యక్రమాలు చేపట్టినట్లయితే అట్టి వారిపై కఠిన చర్య తీసుకుంటామన్నారు.

## నిజాంపేట నూతన ఎస్ఐని సన్మానించిన జర్నలిస్టులు...





**నిజాంపేట,ఏప్రిల్08(సూర్యరేఖ)** మండల కేంద్రంలో నూతన ఎస్ఐగా పదవి బాధ్యతలు స్వీకరించిన ఎస్ఐ బండి.రాజేష్,ను నిజాంపేట మండల జర్నలిస్టులు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి ఆయనను శాలువాతో సన్మానించారు.మండలంలో సైబర్ నేరాలు,మారక దవ్యాలపై,సమాచారాన్ని పోలీస్ శాఖ అందించాలన్నారు.మండలంలో ప్రతి ఒక్కరురోడ్డు భద్రతా నియమాలు శాంతిభద్రతలకు పాటుపడాలన్నారు.ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రభ రిపోర్టర్ చంద్రకాంత్ గౌడ్,వార్త రిపోర్టర్ నవీన్ రెడ్డి, నమస్తే తెలంగాణ రిపోర్టర్ బండారి సిద్ధరాములు ప్రజాపక్షం రిపోర్టర్ దుబాసి సంజీవ్,నేటి దాత్రి రిపోర్టర్ బాల్ రాజు,దిశ రిపోర్టర్ శ్రీకాంత్,పాల్గొన్నారు.

## హరివరసనం సొసైటీ అధ్యక్షులుగా బుర్ర మహేందర్



**ఉప్పల్,ఏప్రిల్ 08 (సూర్యరేఖ)** హైదరాబాద్ హరివరసనం సొసైటీ అధ్యక్షులుగా రామంతపూర్ కు చెందిన బుర్ర మహేందర్ ను నియమిస్తూ సొసైటీ రీజనల్ డైరెక్టర్ కెపి శాంత ఉత్తర్వులు జారీ చేశారు.ఉపాధ్యక్షులుగా ఎం.రాజమ్మ, ప్రధాన కార్యదర్శిగా బి.వెంకట్రావు, సంయుక్త కార్యదర్శిగా ఎస్ రాజ్యలక్ష్మి,కోశాధికారిగా సినిషాలను నియమించారు.నూతన సొసైటీ సభ్యులను రామంతపూర్ గోకుల్ నగర్ అయ్యప్ప దేవాలయం పూజారి ఉన్నికృష్ణన్ తిరుమని మురళి మురళీధర్ నాయుడు,లు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సొసైటీ నూతన అధ్యక్షులుగా నియమితులైన బుర్ర మహేందర్ మాట్లాడుతూ... సొసైటీ నియమ నిబంధనలకు లోబడి పని చేస్తూ అవసరమైన కార్యక్రమాలు చేపడతానని పేర్కొన్నారు.

# కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను ఎండగడతాం



**చేగుంట,ఏప్రిల్ 08(సూర్యరేఖ)** ఆల్ ఇండియా కాంగ్రెస్ కమిటీ తలపెట్టిన జై బాబు.. జై .భీమ్ జై..సంవిధాన్ కార్యక్రమానికి నార్సింగ్ మండల కో-ఆర్డినేటర్ గా నియమించినందుకు కాంగ్రెస్ సీనియర్ నాయకులు జూకంటి రాజాగౌడ్ దుబ్బాక నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి చెరుకు శ్రీనివాస్ రెడ్డి,పిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్,ఏఐసీసీ తెలంగాణ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి మీనాక్షి నటరాజన్ కు కాంగ్రెస్ నాయకులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ఈ సందర్భంగా విలేకరుల సమావేశంలో మాట్లాడు తూ...ఆల్ ఇండియా కాంగ్రెస్ పార్టీ తలపెట్టిన జై బాబు జై భీమ్ జై సంవిధాన్ కార్యక్రమానికి నార్సింగ్ మండలంలో త్వరలో తలపెట్టే కార్యక్రమాని మండల కాంగ్రెస్ నాయకులు ప్రజాప్రతినిధుల సహకారంతో విజయవంతం చేయడానికి తనవంతు కృషి చేస్తానని పేర్కొన్నా రు. కేంద్ర ప్రభుత్వం బిజెపి పార్టీ అవలంబి స్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను గ్రామాల్లో తీసుకెళ్లి ప్రజలకు వివరిస్తామన్నారు. నాటినుండి నేటి వరకు బడుగు బలహీన వర్గాల ప్రజల అభివృద్ధి కోసం ముందుండి పనిచేస్తున్న కాంగ్రె స్ చేపడుతున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్తామన్నారు.ఏఐసిసి తెలంగాణ కాంగ్రెస్ పార్టీ తలపెట్టిన ఈ కార్యక్రమాన్ని ప్రతి కాంగ్రెస్ కార్యకర్త ముందుండి నడిపిస్తామన్నారు.బిజెపి కొంతమంది పెట్టుబడుదారుల కోసం ప్రభుత్వ సంస్థలను పెట్టుబడుదారులకు దారా దత్తం చేస్తుందని విమర్శించారు.దేశంలో ప్రజావసరాల నిమిత్తం కాంగ్రెస్ పార్టీ కూడా పెట్టిన ఆస్తులను అంబానీ ఆదానీల వశం చేయడానికి చేస్తున్న బిజెపి విధానాలను ప్రజలకు వివరిస్తామన్నారు. మహాత్మా గాంధీ స్వాతంత్ర ఉద్యమం చరిత్రను చేరిపి వేసే విధంగా అలాగే డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఆశయాలను తుంగలో తొక్కేందుకు కుట్ర చేస్తుందని పేర్కొన్నారు.అట్టి ప్రయత్నాలను కాంగ్రెస్ పార్టీ అడ్డుకుంటామని తెలిపారు.దీనికి ప్రజలు మద్దతు పలకాలని కోరారు.దేశంలో ఉన్న బడుగు బలహీన వర్గాల కోసం ఆనాడు అంబేద్కర్ రచించిన రాజ్యాంగాన్ని కాపాడుకోవా ల్సిన బాధ్యత మనందరి మీద ఉందని దానికి అందరూ సహకరించాలని కోరారు.

# మూడవ పిచ్ ను ప్రారంభించిన సివిల్ జడ్జి







**బెల్లంపల్లి,ఏప్రిల్ 08(సూర్యరేఖ)** బెల్లంపల్లి పట్టణంలోని మురళి మెమోరియల్ క్రికెట్ అకాడమీలో మూడవ పిచ్ ను బెల్లంపల్లి సివిల్ జడ్జి ముఖేష్ ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...అకాడమీ వారు ఏర్పాటు చేసిన సదుపాయాలను క్రీడాకారులు ఉపయోగించుకొని నైపుణ్యాన్ని పెంచుకోవాలని అన్నారు.ఈ కార్యక్ర మంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు శివకు మార్,కార్యదర్శి రవికుమార్, క్రికెట్ అకాడమీ కార్యదర్శి అల్లం వెంకటేశ్వర్లు, కోచ్ గౌతం,వివిధ పాఠశాలలకు సంబంధించిన పీఈటీలు,శిక్షణ పొందుతున్న విద్యార్థుల తల్లిదండ్రులు,తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ ఆసుపత్రిలో సాయి భోజన్





**గర్భిణులకు బాలింతలకు డయాలసిస్ పేషెంట్లకు అన్నదానం..**

**బాయిజమ్మ సాయి సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహణ..**

**బెల్లంపల్లి,ఏప్రిల్ 08 (సూర్యరేఖ)**బెల్లంపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో మంగళవారం మధ్యాహ్నం సనాతన ధర్మ బాయిజమ్మ సాయి భక్తి ప్రచార ధార్మిక సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో ట్రస్ట్ దాతల సహకారంతో గర్భిణులకు బాలింతలకు, డయా లసిస్ రోగులకు,అన్నార్తులకు సాయి భోజన్ అన్నదానం చేసినట్లు ట్రస్ట్ వ్యవస్థాపకులు ప్రముఖ విద్యావేత్తలు డాక్టర్ కాంపల్లి శంకర్ - రాజేశ్వరి తెలిపారు.ఈ సందర్భంగా ఆస్పత్రిలోని గర్భిణీలు, బాలింతలు రోగులు అన్నార్తులు, ఆసుపత్రి సిబ్బంది, సా యి భోజన్ అన్నదాన కార్యక్రమాన్ని వినియోగిం చుకున్నారు.వారందరూ అన్నదానం చేయడం పట్ల సంతృప్తి వ్యక్తం చేస్తూ, బాయిజమ్మ సాయి సేవా ట్రస్ట్ వారికి దాతలకు కృతజ్ఞతలు తెలియ జేశారు.ట్రస్ట్ ద్వారా "ఆకలితో ఉన్నవారిని అతిథి సత్కారంతో ఆదరిద్దాం-అన్నదానంతో తృప్తి పరుద్దాం" అని ట్రస్ట్ వ్యవస్థాపకులు ప్రముఖ విద్యావేత్తలు డాక్టర్ కాంపల్లి శంకర్-రాజేశ్వరి పిలుపునిచ్చారు.సేవే లక్ష్యం సేవే మార్గంతో ట్రస్ట్ కొనసాగుతుందని,మానవ సేవే మాధవ సేవ అని త్రవిద్య,శ్రవిద్య,త్రయాక్షర్ సూచించారు.ఈ సేవా కార్యక్రమములో ట్రస్ట్ మేనేజర్ బొద్దున సతీష్,సభ్యులు కాంపల్లి రాజేశ్వరి,జేరిపోతుల చంద్రకళ,సేవకులు దొంగల మధుకర్ పోతరాజులు తిరుపతి,ఎండి యూసఫ్, దాతలు తదితరులు పాల్గొన్నారు. బాయిజమ్మసాయి సేవా ట్రస్ట్ ద్వారా అన్నదానం,సాయం అందించాలని అనుకునే వారు ట్రస్ట్ మేనేజర్ 8106550532, ఫౌండర్స్ 9959269975, 9949041595 సంప్రదిం చాలని తెలిపారు.

## ఉపాధి హామీ కూలీలకు కనీస సౌకర్యాలు కల్పించాలి..




**నిజాంపేట,ఏప్రిల్08(సూర్యరేఖ)** మండల పరిధిలోని నస్కల్ గ్రామంలో మంగళవారం ఉపాధి హామీ పనులను డిబిఎఫ్ జిల్లా నాయకులు దుబాసి సంజీవ్,సందర్శించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...ఉపాధి హామీ కూలీలకు కనీస సౌకర్యాలు కల్పించాలన్నారు.ఉపాధి కూలీలకు నీడ సౌకర్యం ఉండేలా టెంట్ ను ఏర్పాటు చేయాలని త్రాగునీరు, ఓఆర్ ఎస్ ప్యాకెట్లను అందించాలన్నారు.వారి పనిని బట్టి కూలీలకు డబ్బులను చెల్లించాలని వారు ప్రభుత్వానికి డిమాండ్ చేశారు.

## ఏసీపీని సన్మానించిన క్రికెట్ అకాడమీ సభ్యులు..



**బెల్లంపల్లి,ఏప్రిల్ 08(సూర్యరేఖ)** బెల్లంపల్లి పట్టణంలోని శ్రీమురళీ మెమోరియల్ క్రికెట్ అకాడమీలో మూడవ పిచ్ ని నూతనంగా నిర్మించిన సందర్భంగా బెల్లంపల్లి ఏసిపి రవికుమార్ ను అకాడమీ సభ్యులు శాలువా కప్పి సన్మానించారు.ఈ క్రికెట్ అకాడమీని గతంలో ఏసీపి ప్రారంభించిన విషయం తెలిసిందే.అందుకు కృతజ్ఞతగా అకాడమీ సభ్యులు ఏసీపిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఏసీపిని కలిసిన వారిలో అకాడమీ కార్యదర్శి అల్లం వెంకటేశ్వర్లు,కోచ్ గౌతమ్,అకాడమీ సభ్యులు రెడ్డి శ్రీనివాస్,డేవిడ్,పి.హరీష్ తదితరులు పాల్గొన్నారు..

## చిన్నారుల ప్రాణాలను కాపాడడానికి ఉపాధ్యాయులు ముందుకు రావాలి..



**కామారెడ్డి.ఏప్రిల్ 08(సూర్యరేఖ)** కామారెడ్డి జిల్లా ఎల్లారెడ్డి నియోజక వర్గం తాడ్వాయి మండల కేంద్రంలో ఈ నెల 14వ తేదీ సోమవారం అంబేద్కర్ జయంతి సందర్భంగా తలసేమియా వ్యాధితో బాధపడుతున్న చిన్నారుల కోసం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించనున్న మెగా రక్తదాన శిబిరానికి సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు.ఈ సందర్భంగా ఎంఈఓ రామస్వామి మాట్లాడుతూ...కామారెడ్డి రక్తదాతల సమూహం,అంబేద్కర్ యువజన సంఘాలు,ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ ల ఆధ్వర్యంలో చిన్నారుల ప్రాణాలను కాపాడడం కోసం మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించడం అభినందనీయమని మండలంలో ని ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో ముందుకు వచ్చి రక్తదానం చేసి చిన్నారుల ప్రాణాలను కాపాడాలని విజ్ఞప్తి చేశారు.వేసవికాలం కావడం వలన తలసేమియా చిన్నారులకు కావలసిన రక్తం దొరకకపోవడంతో చిన్నారులు ఎవరు ఇబ్బందులకు గురవుతున్నారని అంబేద్కర్ జయంతి రోజున ఇలాంటి సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని అన్నారు.ఈ కార్యక్రమంలో ఐవిఎఫ్ సేవాదళ్ రాష్ట్ర చైర్మన్,కామారెడ్డి రక్తదాతల సమూహ ఫౌండర్ డాక్టర్ బాలు,కామారెడ్డి రక్తదాతల సమూహ అధ్యక్షులు జమీల్ హైమద్,ఉపాధ్యక్షులు వెంకట రమణ,లు పాల్గొన్నారు.

# రంగారెడ్డి రూరల్ జిల్లా బిజెపి అధ్యక్షుడు రాజ్ భూపాల్ గౌడ్ ను మర్యాదపూర్వకంగా కలిసిన రాజేంద్రనగర్ డివిజన్ నాయకులు



**రాజేంద్రనగర్,ఏప్రిల్08(సూర్యరేఖ)** రంగారెడ్డి జిల్లాలో భారతీయ జనతా పార్టీ బలోపేతానికి అన్ని విధాల నూతన రూరల్ జిల్లా అధ్యక్షుడు రాజ భూపాల్ గౌడ్ కృషి చేయనున్నట్లు రాజేంద్ర నగర్ డివిజన్ ప్రధాన కార్యదర్శి బండారి బాల కృష్ణ అన్నారు.మంగళవారం బిజెపి రంగారెడ్డి రూరల్ జిల్లా అధ్యక్షునిగా నియమితులైన రాజ్ భూపాల్ గౌడ్ ని రాజేంద్రనగర్ డివిజన్ నాయకులు, కార్యకర్తలు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా బండారి బాలకృష్ణ మాట్లాడుతూ...భారతీయ జనతా పార్టీ రాష్ట్రంలో రోజురోజుకు బలపడుతుందని అన్నారు.రాబోయే సార్వత్రిక ఎన్నికలతో పాటు ఇతర అన్ని ఎన్నికల్లోను భారతీయ జనతా పార్టీ ఘన విజయం సాధించడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు రెండు ప్రజలను మోసం చేసేందుకు మోసపూరిత మాటలు చెబుతున్నారని మండిపడ్డారు.దీంతో ప్రజలు ఆయా పార్టీల పట్ల విసిగిపోయారని అన్నారు.ఈ మేరకు రంగారెడ్డి జిల్లాలో భారతీయ జనతా పార్టీని బలోపేతం చేసే దిశగా ప్రతి నాయకుడు,కార్యకర్త శ్రమించాలని పిలుపుని చ్చారు.ఈ కార్యక్రమంలో కార్యదర్శి పెండ్యాల సురేందర్,డివిజన్ బీజేవైఎం అధ్యక్షులు ఓబీసీ మోర్చా డివిజన్ కార్యదర్శి యాదయ్య, రాపర్తి గౌడ్,బాలుగౌడ్,అక్షిత్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# అంగన్ వాడి కేంద్రంలో పోషణ పక్షం 1000 రోజుల ప్రాముఖ్యత కార్యక్రమం






**ఉప్పల్,ఏప్రిల్ 08 (సూర్యరేఖ)** బీరప్ప గడ్డ - అంగన్ వాడి కేంద్రం పోషణ పక్షం కార్య క్రమాలు మొదటి రోజు ప్రారంభమయ్యాయి. పోషణ పక్షం కార్యక్రమం ఏప్రిల్ 8 నుండి 22 ఏప్రిల్ వరకు ఈ కార్యక్రమాలు అంగన్వాడీ సెంటర్ పరిధిలో జరగనున్నాయి.మంగళవారం జరిగిన పోషణ పక్షం కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఉప్పల్ సెక్టార్ సూపర్వైజర్ వెంకటరమణ హాజరయ్యారు.టిఎస్ ఆర్ టిసి కాలేజీ లక్ష్మిదేవి సేత,లక్ష్మి,రూమి మేడం హాజరయ్యారు.గర్భిణీ స్త్రీలు రక్తహీనత ఎలా ఉంటుందని,ఆరోగ్య వంతమైన పుడ్డడ ఎలా అనే అంశంపై గౌరి టిఎస్ఆర్ టిసి విద్యార్థిని స్క్రిప్ట్ చేయడం జరిగింది.పోషణ పక్షం 1000 రోజుల ప్రాముఖ్యత గురించి సూపర్ వైజర్ వేరకటరమణ మగర్భిణీలకు, తల్లులకు పూర్తిగా వివరించారు.ఈ కార్యక్రమానికి బీరప్పగడ్డ అంగన్ వాడీ కేంద్రంకు వచ్చే తల్లులు అధిక సంఖ్యలో హాజరయ్యారు అంగన్వాడి టీచర్ ఎస్.నీరజ,అయా కె.ప్రశాంతిలు పాల్గొన్నారు.

# గండిపేట మండలం కోకాపేటలో అక్రమ నిర్మాణాల కూల్చివేత





**గండిపేట,ఏప్రిల్ 08** గండిపేట మండలంలోని కోకాపేటలో అక్రమ కట్టడాలపై రెవెన్యూ అధికారులు కొరడా ఝులిపించారు.నార్సింగ్ మున్సిపల్ పరిధిలోని కోకాపేట్ సర్వే నంబర్ 100లో అడ్డగోలుగా అక్రమ నిర్మాణాలు వెలిశాయి. మంగళవారం ఉదయం రెవెన్యూ అధికారులు గట్టి భద్రత మధ్య కూల్చివేతలు చేపట్టారు.ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురైనట్లు సమాచారం అందడంతో అధికారులు అక్కడికి చేరుకున్నారు.ఆక్రమణకు గురైన భూమిలో వ్యాపార సముదాయాల నిర్మాణం జరుగుతోంది. స్థానిక పౌరుల ఫిర్యాదుల మేరకు,గండిపేట తాహసిల్దార్ శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో అధికారులు,పోలీసు సిబ్బంది, జేసీబీలతో సంఘటనా స్థలానికి చేరుకుని కూల్చివేత పనులను చేపట్టారు.భారీ పోలీసు భద్రత మధ్య కూల్చివేతలు కొనసాగాయి. కబ్జాకోరులు కోట్లు విలువ చేసే ప్రభుత్వ స్థలాన్ని కబ్జా చేశారు. తెల్లవారుజామేనే రంగంలోకి దిగిన రెవెన్యూ అధికారులు అక్రమ కట్టడాలను నేలమట్టం చేశారు.

## వృత్తి శిక్షణ తరగతులను మహిళలు సద్వినియోగం చేసుకోవాలి

### సింగరేణి సేవా అధ్యక్షురాలు జి.స్వరూపరాణి దేవేందర్



**మందమర్రి,ఏప్రిల్ 08(సూర్యరేఖ)** మహిళల ఆర్థికాభివృద్దే లక్ష్యంగా సింగరేణి సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వృత్తి శిక్షణ తరగతులను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని సింగరేణి సేవా సమితి ఏరియా అధ్యక్షురాలు జి స్వరూపరాణి దేవేందర్ కోరారు. మండలంలోని ఆదిల్ పేట గ్రామంలో సింగరేణి సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న టైలరింగ్ వృత్తి శిక్షణ తరగతులు ఈనెల ముగిస్తుండటంతో శిక్షణ శిబిరాన్ని మంగళవారం ఆమె సందర్శించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ. సింగరేణి యాజమాన్యం సింగరేణి సేవా సమితి ఆధ్వర్యంలో మహిళలకు, యువతులకు యువకులకు ఎన్నో శిక్షణ కార్యక్రమాలను నిర్వహిస్తుందన్నారు.ఈ సంవత్సరం ఏరియాలో మహిళలకు,యువతులకు టైలరింగ్, ఫ్యాషన్ డిజైనింగ్,మగ్గం వర్క్, బ్యూటిషన్, కంప్యూటర్ కోర్సులు ప్రారంభించామన్నారు. మహిళలు ఆర్థికంగా వృద్ధి చెందాలని సింగరేణి సేవా సమితి ఎన్నో కోర్సులు ప్రవేశపెడుతున్నామని తెలిపారు.సేవా సమితి ఆధ్వర్యంలో మహిళలు తయారు చేసిన వాటిని విక్రయించడానికి హైదరాబాద్ శిల్పారామంలో ప్రతి సంవత్సరం జరుగు నాంపల్లి ఇంటర్నేషనల్ ఎగ్జిబిషన్లో స్టాల్స్ నిర్వహిస్తున్నామన్నారు.మహిళలందరూ ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో లేడీస్ క్లబ్ సభ్యులు కవిత,మణి, సింగరేణి సేవా సమితి కోఆర్డినేటర్ నెల్సన్, కమ్యూనికేషన్స్ కోఆర్డినేటర్ నరేష్,శిక్షకురాలు రజిత,అభ్యర్థులు పాల్గొన్నారు.

## మూడవ పిచ్ ను ప్రారంభించిన సివిల్ జడ్జి..



**బెల్లంపల్లి,ఏప్రిల్ 08(సూర్యరేఖ)** బెల్లంపల్లి పట్టణంలోని మురళి మెమోరియల్ క్రికెట్ అకాడమీలో మూడవ పిచ్ ను బెల్లంపల్లి సివిల్ జడ్జి ముఖేష్ ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. అకాడమీ వారు ఏర్పాటు చేసిన సదుపాయాలను క్రీడాకారులు ఉపయోగించుకొని నైపుణ్యాన్ని పెంచుకోవాలని అన్నారు.ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు శివకుమార్,కార్యదర్శి రవికుమార్,క్రికెట్ అకాడమీ కార్యదర్శి అల్లం వెంకటేశ్వర్లు,కోచ్ గౌతం,వివిధ పాఠశాలలకు సంబంధించిన పీఈటీలు,శిక్షణ పొందుతున్న విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## సీనియర్స్ ప్రెస్ క్లబ్ నూతన కార్యవర్గం ఏర్పాటు..



**శివంపేట,మార్చి 08(సూర్యరేఖ)** సమాజంలో జర్నలిస్టుల పాత్ర కీలకమైందని, ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారిదిగా ఉంటూ ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్న వర్కింగ్ జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి అహర్నిశలు కృషి చేస్తామని ప్రెస్ క్లబ్ అధ్యక్షులు అబ్దుల్ అజీజ్,ప్రధాన కార్యదర్శి గోవిందురాజ్,లు అన్నారు.శివ్వంపేట సీనియర్ ప్రెస్ క్లబ్ లో ఇద్దరు సీనియర్ జర్నలిస్టులు చేరిన సందర్భంగా ప్రెస్ క్లబ్ అధ్యక్షులు అబ్దుల్ అజీజ్,ప్రధాన కార్యదర్శి గోవిందురాజు చారి అధ్యక్షతన మంగళవారం స్థానిక కోదండరామస్వామి ఆలయంలో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా వారిని ప్రెస్ క్లబ్ లోకి సాదరంగా ఆహ్వానిస్తూ కార్యవర్గం ఏర్పాటు చేయగా అధ్యక్షునిగా అబ్దుల్ఆజీజ్, ప్రధాన కార్యదర్శిగా గోవిందరాజ్ చారి,ఉపాధ్యక్షులుగా వజ్జె రాజు, కోశాధికారిగా శేరిపల్లి నరేష్,ముఖ్య సలహాదారులుగా శెట్టిపల్లి వెంకటేష్, ప్రచార కార్యదర్శిగా సానేఆనంద్,సంయుక్త కార్యదర్శిగా దొడ్లే సంతోష్,లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సభ్యులుగా,వడ్ల గణేష్ కుమార్, షబ్బీర్, బుర్ర ఆంజనేయులు గౌడ్,పబ్బ సందీప్ పాల్గొన్నారు.

## ప్రజలకు గోదావరి తాగునీరు..

కమిషనర్ శ్రీనివాసరావు



**బెల్లంపల్లి,ఏప్రిల్ 08 (సూర్యరేఖ)**బెల్లంపల్లి ప్రజలకు త్వరలోనే ఎల్లంపల్లి నుంచి మంచినీటిని అందించేందుకు కృషి చేస్తున్నామని మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు తెలిపారు. అమృత్ పథకం ద్వారా గోదావరి మంచినీటిని అందించేందుకు రూ.62కోట్లు మంజూరయ్యాయన్నారు. గోదావరి నుంచి పైపులైన్ నిర్మాణ పనులు శరవేగంగా కొనసాగుతున్నాయని, 18 కిలోమీటర్ల మేర పైపులైన్ వేయాల్సి ఉందని వెల్లడించారు. సెప్టెంబర్ నాటికి పనులు పూర్తవుతాయన్నారు.బెల్లంపల్లికి తొందర్లోనే గంగా వాటర్ ప్రజలకు అందుబాటులోకి తేవడానికి ప్రభుత్వం అన్ని ప్రయత్నాలు చేస్తుందని,పనులన్నీ శరవేగంగా జరుగుతున్నాయని, ప్రజలకు మేలు కలగాలని ప్రభుత్వం అన్ని విధాలుగా ప్రయత్నిస్తుందని ఈ సందర్భంగా వారు తెలిపారు.

# పేదల కడుపు నింపాలనే ఉద్దేశ్యంతో సన్న బియ్యం పథకం

**సన్న బియ్యం లబ్ధిదారుల ఇంట్లో తహసిల్దార్ సామూహిక భోజనం.**



**మందమర్రి,ఏప్రిల్ 08(సూర్యరేఖ)** పేదల కడుపు నింపాలనే ఉద్దేశ్యంతో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నాణ్యమైన సన్న బియ్యం పథకం ఎంతో చేయుతనిచ్చిందని మందమర్రి మండల తహసీల్దార్ సతీష్ కుమార్ అన్నారు.మంగళవారం పట్టణంలోని ఒకటో జోన్ కు చెందిన సన్న బియ్యం లబ్ధిదారులు పొన్నగంటి సుగుణ - లింగయ్య దంపతులు సన్న బియ్యంతో వంట చేయగా స్వయంగా వారి ఇంటికి వెళ్లిన మండల తహసిల్దార్ సతీష్, డి.టీ రవీందర్,రెవెన్యూ ఇన్స్పెక్టర్ గణపతి రాథోడ్, లతో కలిసి సన్నబియ్యంతో చేసిన వంటను లబ్ధిదారుల కుటుంబ సభ్యులతో కలిసి సామూహికంగా భుజించారు.ఈ సందర్భంగా తహశీల్దార్ సతీష్ కుమార్ మాట్లాడుతూ. పేదలకు పూర్తిస్థాయిలో ఆహార భద్రత కల్పించేందుకే ప్రభుత్వం సన్నబియ్యం పంపిణీ కార్యక్రమం చేపట్టిందని తెలిపారు.ప్రతి ఒక్క నిరుపేద కుటుంబం సన్న బియ్యంతో మూడు పూటలా కడుపునిండా భుజించాలనే ఆశయంతో ధనవంతులు తినే సన్న బియ్యాన్ని రేషన్ కార్డు లబ్ధిదారులకు ప్రభుత్వం సన్న బియ్యం సరఫరా చేస్తుందని ఆన్నారు. పేదల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని,చౌక ధరల దుకాణంలో సకాలంలో వెళ్లి సన్నబియ్యం పథకాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.లబ్ధి దారులకు బియ్యం పంపిణీ తూకంలో గాని, పంపిణీలో ఎలాంటి ఇబ్బందులు ఉన్నట్లైతే రెవెన్యూ అధికారులను సంప్రదించాలని తెలిపారు.

# డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల గురించి లబ్ధిదారుల ఆందోళన





**చేగుంట,ఏప్రిల్ 08 (సూర్యరేఖ)** చేగుంట మండలం తహసీల్దార్ కార్యాలయంలో బీఆర్ఎస్ ప్రభుత్వంలో నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల లబ్ధిదారులు ఆందోళన చేపట్టారు.గత ప్రభుత్వం 108 ఇండ్లు నిర్మించినది.బాధితుల ప్రకారం డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల లబ్ధిదారుల జాబితాలో పేర్లు వచ్చినప్పటికి వారికి ఇంకా అధికారికంగా ఇంకా ఇవ్వడం లేదు అని,అలాగే వారికి కేటాయించిన డబుల్ బెడ్ రూమ్ ఇంట్లో వారు అనధికారికంగా ఉంటే రెవెన్యూ సిబ్బంది మీకు పర్మిషన్ లేదంటూ వారిని బయటికి పంపించారు. దీనితో చేసేదేమి లేక లబ్ధిదారులు అందరు తహసీల్దార్ ఆఫీస్ కి వచ్చి ఆందోళన చేపట్టారు. వారికి కేటాయించి డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను తక్షణమే వారికి ఇవ్వాలని లేని యెడల మాకు చావే శరణ్యమని అన్నారు. ఇప్పుడు ఇలా ఇంటికి తాళం వేసి మమ్మల్ని బయటికి పంపిస్తే మేము ఎక్కడ తల దాచుకునేది మాకు ఎలాంటి స్వంత ఇండ్లు లేవని, కావున మాకు జాబితాలో వచ్చిన పేర్ల ప్రకారం తక్షణమే మాకు ఇండ్లు ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు.ఈ విషయంలో తహసీల్దార్ శ్రీకాంత్ ని అడుగగా వారి మాటల్లో లబ్ధిదారుల గురించి గతంలో లిస్టు ఒకే చేశారు కానీ దానిలో కొన్ని సమస్యలు ఉన్నాయి.అలాగే దానిని ఇప్పటివరకు గుత్తాదారు ప్రభుత్వానికి అప్ప చెప్పలేదని, గుత్తాదారు ప్రభుత్వానికి అప్పజెప్పిన తర్వాత ప్రభుత్వ నిర్ణయం ప్రకారం లబ్ధిదారులను మళ్ళీ ఎంపిక చేయడం జరుగుతుంది.దాని ప్రకారం లబ్ధిదారులు అందరికీ ఇవ్వడం జరుగుతుంది. అప్పటివరకు ఎవరు కూడా అక్రమంగా ఉండొద్దని తెలిపారు.

# విద్యను వ్యాపారంగా చేసి నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు ఫిర్యాదు

## టిఎస్ఎస్ఓ రాష్ట్ర అధ్యక్షులు లక్ష్మీనివాస్



**రాజేంద్రనగర్,ఏప్రిల్ 08** విద్యను వ్యాపారంగా చేసి నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని టిఎస్ఎస్ఓ రాష్ట్ర అధ్యక్షులు లక్ష్మీనివాస్ అన్నారు.విద్యా సంవత్సరం పూర్తి కాకముందే పుస్తకాలు పెన్నులు,స్టేషనరీ,దుస్తులు విచ్చలవిడిగా స్కూల్లో వ్యాపారం చేస్తున్నారని రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌ను కలిసి వివరించారు.నిబంధనలు పాటించని పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరారు.ఈ సందర్భంగా లక్ష్మీ నివాస్ మాట్లాడుతూ..గతంలోనూ ఈ సమస్యపై ఎన్నిసార్లు రంగారెడ్డి జిల్లా విద్యాధికారిని కలిసి ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదన్నారు.జిల్లా కలెక్టర్ వెంటనే స్పందించి డీఈవోకు రిఫర్ చేశారన్నారు.విద్య హక్కు చట్టాన్ని గాలికి వదిలేసి విద్యను వ్యాపారంగా చేస్తున్న స్కూళ్లను అనుమతి లేని స్కూళ్లను తక్షణమే మూసివేయాలని,వారిపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరామన్నారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధికార ప్రతినిధి రమేష్ గౌడ్,రఘు ముదిరాజ్,సుధాకర్,తదితరులు పాల్గొన్నారు.

## ఏఐసీసీ మీటింగ్ కు ఎమ్మెల్యే గడ్డం వినోద్



**బెల్లంపల్లి,ఏప్రిల్ 08 (సూర్యరేఖ)** ఏఐసీసీ పిలుపు మేరకు అహ్మదాబాద్ లో జరిగే ఎఐసిసి సమావేశాలుకు బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ తరలి వెళ్లారు.అహ్మదాబాద్ లో ఏఐసీసీ సమావేశాలు జరుగుతున్నాయి. బెల్లంపల్లి నియోజకవర్గ శాసనసభ్యులు గడ్డం వినోద్ వెంకటస్వామి మొదటి రోజు సిడబ్ల్యుసి,రెండో రోజు ఏఐఐసి సమావేశం జరగనుంది. సామాన్య ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కారం,ప్రజలకు ఎలా న్యాయం చేయాలని,దానిపై చర్చ జరుగుతుంది.ప్రజల ఆకాంక్ష మేరకు ప్రజలకు ఏ పనులు చేస్తే మేలు జరుగుతాయో వాటిని ఈ సందర్భంగా చర్చిస్తారు.


## ఘనంగా హనుమత్ వాహనంపై పురవీధుల్లో స్వామివారి ఊరేగింపు



**ఉప్పల్,ఏప్రిల్ 08 (సూర్యరేఖ)** ఉప్పల్ లోని శ్రీ రామచంద్ర స్వామి దేవస్థానంలో శ్రీ సీతారామ కళ్యాణ రథోత్సవ బ్రహ్మోత్సవాలలో భాగంగా రెండవ రోజు మంగళవారం రామచంద్ర స్వామి వారు అత్యంత వైభవంగా హనుమత్ వాహనంపై ఊరేగించారు.ఉప్పల్ పుర వీధుల్లో స్వామి వారు దర్శనం ఇచ్చారు.ఈ కార్యక్రమం ఆలయ వ్యవస్థాపక అనువంశిక ధర్మకర్తల ఆధ్వర్యంలో జరిగింది.అనంతరం అన్నదాన వితరణ కార్యక్రమం జరిగింది.కార్యక్రమంలో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

## సీఎంఆర్ఎఫ్ పేదలకు వరం..

**బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు ఎర్ర యాదగిరి**




**చేగుంట,ఏప్రిల్ 08(సూర్యరేఖ)** సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు గొప్ప వరమని బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు ఎర్ర యాదగిరి అన్నారు. మంగళవారం చేగుంటకు సోమ యాదగిరికి దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి ఆదేశాల అంఅనుసరం రూ.24 వేల చెక్కును అందజేశారు.ఈ సందర్భంగా ఎర్ర యాదగిరి మాట్లాడుతూ...పేదలకు కార్పొరేట్‌స్థాయిలో వైద్యం అందించేందుకు మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఈ పథకం అమలు చేస్తున్నారని దీనిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.అనారోగ్యంతో బాధపడుతున్న వారు స్థానికుల నాయకుల ద్వారా తన దృష్టికి తీసుకురావాలని సూచించారు.ఈ కార్యక్రమంలో సొసైటీ డైరెక్టర్ ఐత రఘురాములు,మురారి, లక్ష్మణ్,సోమ భూపాల్, సోమ కిషన్,సోమ యాదగిరి, సోమ భరత్,భగవాన్,వంజరి శీను, తదితరులు పాల్గొన్నారు.

# సింగరేణి ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో పాలిసెట్ ఉచిత శిక్షణ




**మందమర్రి,ఏప్రిల్08(సూర్యరేఖ)** సింగరేణి కాలరీస్ ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో టీఎస్ పాలిసెట్ 2025 పరీక్షకు ఉచిత బోధన తరగతులు నిర్వహిస్తున్నామని సింగరేణి ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు పురుషోత్తం తెలిపారు.పట్టణంలోని పాఠశాలలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ..సింగరేణి సిఎండి ఇన్ బలరాం డైరెక్టర్ (పా) కె వెంకటేశ్వర్లు ఆదేశాల మేరకు సింగరేణి కాలరీస్ ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో ఏప్రిల్ 10 నుంచి మే 10 వ తేదీ వరకు సింగరేణి పాఠశాలలో ఉచిత శిక్షణ తరగతులు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు.2025 లో పదవ తరగతి పూర్తి చేసి, సింగరేణి పాఠశాలతో పాటు పట్టణంలోని ప్రభుత్వ,ప్రైవేట్ పాఠశాలల్లో చదువుకున్న సింగరేణి ఉద్యోగుల పిల్లలు అర్హులని ఆయన స్పష్టంచేశారు.పాలిసెట్ అర్హత పరీక్ష ద్వారా విద్యార్థులు ఇంజనీరింగ్, ఫార్మసీ,అగ్రికల్చర్ వంటి విభాగాల్లో 3 సంవత్సరాల డిప్లొమా కోర్సుల్లో ప్రవేశం పొందవచ్చని ఆయన సూచించారు. లాటరల్ ఎంట్రీ ద్వారా ఇంజనీరింగ్ డిగ్రీ కోర్సుల్లో చేరవచ్చని,ప్రభుత్వ ప్రైవేట్ రంగ సంస్థల్లో ఉద్యోగ అవకాశాలు సైతం పొందేందుకు అవకాశం ఉందని,అలాగే స్వంతంగా పరిశ్రమ, వ్యాపారం స్థాపించి స్వయం ఉపాధి పొందవచ్చునని తెలిపారు.మరిన్ని పూర్తి వివరాలకు 9849215692 గల నెంబర్లో సంప్రదించాలని సూచించారు.

## ఉద్యాన వర్సిటీ నూతన డీన్ ఆఫ్ స్టూడెంట్స్ అఫైర్స్‌గా నియమితులైన చినా నాయక్ కు శుభాకాంక్షలు తెలిపిన విద్యార్థి నాయకులు



**రాజేంద్రనగర్,ఏప్రిల్ 08** శ్రీ కొండా లక్ష్మణ్ తెలంగాణ ఉద్యాన విశ్వ విద్యాలయంలో నూతన డీన్ ఆఫ్ హార్టికల్చర్,డీన్ ఆఫ్ స్టూడెంట్స్ అఫైర్స్ గా నియమితులైన డాక్టర్ చినా నాయక్ కు ఉద్యాన విద్యార్థి నాయకులు శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా ఉద్యాన విద్యార్థి నాయకులు మాట్లాడుతూ...విశ్వవిద్యాలయం నూతన డీన్‌గా చినా నాయక్ మరింత చొరవతో చేస్తారనే ఆశాభావాన్ని వ్యక్తం చేశారు.

## నిరుపేద విద్యార్థులకు అండగా నిలుస్తున్న సానీక్ష ఫౌండేషన్




**చేగుంట,ఏప్రిల్ 08 (సూర్యరేఖ)** చేగుంట మండలం బీటెక్ చదువుతున్న నిరుపేద కుటుంబానికి చెందిన ప్రేమలతకు సానీక్ష ఫౌండేషన్ కంప్యూటర్ అందజేశారు.మంగళవారం ఖాజాపూర్ తండా చిన్న శంకరంపేట్ మండలంకు చెందిన డైలీ కూలి రాజు కూతురు బివిఆర్ఐటి కాలేజీలో బీటెక్ చదుతున్నది.బీటెక్ కోర్స్ కొనసాగించడానికి కంప్యూటర్ తప్పనిసరిగా కావాలని కాలేజీ యాజమాన్యం చెప్పడంతో తల్లి తండ్రులను కోరాడంతో ఇప్పించలేని స్థితిలో ఉండడం వలన దిక్కుతోచక పోవడంతో ప్రేమలత సానీక్ష ఫౌండేషన్ అధ్యక్షులు డాడి శివ దృష్టికి తీసుకెళ్లి ఉన్నత చదువులకు సహకారం అందించండి అని కోరారు. వెంటనే స్పందించి హైదరాబాద్ కు హెచ్2హెచ్ కాచిగూడ,అహిల్య ఉమెన్ ఫౌండేషన్ వారి సహకారంతో సానీక్ష ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఖాజాపూర్ తండాలో లాప్టాప్ అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో సానీక్ష ఫౌండేషన్ అధ్యక్షులు శివ,ఫీల్డ్ ఆఫీసర్ రవి,మాజీ స్కూల్ చైర్మన్ సురేష్, రాంచరణ్ పాల్గొన్నారు.

## ముస్సిపల్ అధికారులు తాగునీటి సమస్యలను పట్టించుకోరా.!

**బిజెపి జిల్లా అధికార ప్రతినిధి పోతరవేని క్రాంతి**



**మంథని,ఏప్రిల్ 08(సూర్యరేఖ)**మంథని మున్సిపల్ అధికారులు తాగునీటి సమస్యలు పట్టించుకోవాలని,తక్షణమే నీటి కొరత లేకుండా తీర్చాలని బిజెపి జిల్లా అధికార ప్రతినిధి పోతరవేని క్రాంతి కుమార్ మంగళవారం ఒక్క ప్రకటనలో డిమాండ్ చేశారు.ఇప్పుడిప్పుడే ఎండలు మొదలవుతున్న సందర్భంలో వచ్చే వేసవికాలం దృష్ట్యా అధికారులు ముందస్తు ఏర్పాట్లు చేయాలని ఆయన కోరారు.మంథని మున్సిపాలిటీ పరిధిలోని ఆరవ వార్డు బోయినపేటలో మిషన్ భగీరథ నీళ్లు రావడంలేదని ఆయన ఆరోపించారు.ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు తక్షణమే స్పందించి చర్యలు తీసుకోవాలని,లేనిపక్షంలో ఖాళీ బిందెలతో మున్సిపల్ ఆఫీస్ ప్రాంగణంలో నిరసన వ్యక్తం చేస్తామని ఆయన తెలిపారు.

## శ్రీ పెద్దమ్మ జాతరకు రావాలని ఎస్సైకి ఆహ్వాన పత్రిక అందజేత



**రామాయంపేట,ఏప్రిల్08(సూర్య రేఖ)** రామాయంపేట మండలం దామరచెరువు గ్రామంలో శ్రీ పెద్దమ్మ జాతర ఉత్సవాలకు రావాలని రామాయంపేట ఎస్సై బాలరాజ్‌కు గ్రామ ముదిరాజ్ సంఘం నాయకుల ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఆయనకు ఆహ్వాన పత్రిక అందజేశారు.ఈ నెల 17వ తేదీ నుండి నాలుగు రోజుల పాటు గ్రామంలో జాతర ఉత్సవాలు జరుగుతాయని సంఘం నాయకులు తెలిపారు.శాంతియుతంగా జాతర ఉత్సవాలు జరుపుకోవాలని అనవసరంగా గొడవలు పడి ఇబ్బందులకు గురికావద్దని పేర్కొన్నారు. అందరూ సంతోషంగా ఉండి ఈ జాతర ఉత్సవాలు ప్రశాంతంగా జరుపుకోవాలని ముదిరాజ్ సంఘం నాయకులకు ఎస్సై బాలరాజ్ సూచించారు.

## అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించిన పెద్దపల్లి ఎమ్మెల్యే



**పెద్దపల్లి,ఏప్రిల్ 08(సూర్యరేఖ)** పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పెద్దపల్లి నియోజకవర్గంలోని పలు అభివృద్ధి పనుల గురించి పంచాయతీ రాజ్,గ్రామీణ నీటి సరఫరా శాఖ, మున్సిపల్ అధికారులతో శాసనసభ్యులు చింతకుంట విజయరమణ రావు సమీక్షా సమావేశం నిర్వహించారు.అభివృద్ధి పనులను త్వరతగతిన పూర్తి చేయించి ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చే విధంగా పనిచేయాలని సూచించారు.ఎండా కాలాన్ని దృష్టిలో ఉంచుకొని త్రాగు నీటి సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పర్యవేక్షించాలని, గ్రామీణ, పట్టణ నీటి పారుదల శాఖ అధికారులకు ఎమ్మెల్యే విజయరమణ రావు ఆదేశించారు.ఈ కార్యక్రమంలో మిషన్ భగీరథ,గ్రిడ్ ఈ.ఈ పూర్ణ చందర్,ఈ.ఈ శ్రీనివాస్,డి.ఈ.ఈ అనిల్, సతీష్,పంచాయతీ రాజ్ ఈ.ఈ గిరీష్ బాబు,డి.ఈ రాజ్ కుమార్, శ్రీనివాస్, ఎ.ఈలు,మున్సిపల్ అధికారులు,పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

## పిల్లలు పుట్టగానే సంతోషం కంటే,ప్రయోజకులు అయినప్పుడే తల్లిదండ్రులకు ఎంతో సంతోషం

**సంఘ సేవకులు అయిత పరంజ్యోతి**



**చేగుంట,ఏప్రిల్08(సూర్యరేఖ)** మెదక్ జిల్లా చేగుంట మండలం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో భౌతిక శాస్త్ర ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న సుధాకర్ రెడ్డి కూతురు నిఖితారెడ్డి గ్రూప్ 1 ఫలితాలలో రాష్ట్రస్థాయిలో 8వ ర్యాంకు,మల్టీజోన్ రెండో ర్యాంకు సాధించిన సందర్భంగా చేగుంట పాఠశాల ఉపాధ్యాయులు ఏర్పాటుచేసిన సన్మాన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అయిత పరంజ్యోతి హాజరయ్యారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ. తల్లిదండ్రులు పిల్లలు పుట్టగానే సంతోషం కంటే,వారు ప్రయోజకులు అయినప్పుడే సంతోషం ఎక్కువగా ఉంటుందని,ఒక మారుమూల గ్రామంలో పుట్టి రాష్ట్రస్థాయిలో ఎనిమిదో ర్యాంకు సాధించడం చాలా సంతోషమని త్వరలో డిప్యూటీ కలెక్టర్ గా బాధ్యతలు స్వీకరించిన తర్వాత సమాజానికి సేవ చేయాలని,దేశంలోనే మంచి డిప్యూటీ కలెక్టర్ గా గుర్తింపు పొందాలని మిమ్మల్ని ఆదర్శంగా తీసుకొని విద్యార్థులు కూడా భవిష్యత్తులో మంచి స్థానంలో ఉండాలని వారన్నారు.ఈ కార్యక్రమంలో చేగుంట ఎంఈఓ నీరజ, రాజేశ్వర్ సుధాకర్ రెడ్డి,రాధా,రమ,చల్లా లక్ష్మణ్ సురేందర్, శారద వెంకటేష్ భవాని,రేఖ,శ్రీవాణి,సరస్వతి,పులి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# తుర్కయంజాల్ ఎఫ్ఎస్సీఎస్ ని సందర్శించిన సొసైటీ చైర్మెన్



**తుర్కయంజాల్,ఏప్రిల్08(సూర్య రేఖ)** ఒడిశా రాష్ట్రం కో ఆపరేటివ్ రిజిస్టర్, అసిస్టెంట్ రిజిస్టర్లు సహకార పర్యటనలో భాగంగా మంగళవారం తుర్కయంజాల్ ఎఫ్ఎస్సీఎస్ ని సందర్శించారు.ఈ సందర్భంగా సొసైటీ పనితీరును ప్రశంసించి సొసైటీ చైర్మన్,టీజీసీఏబీ వైస్ చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్యను కలిసి అభినందనలు తెలిపారు.ఈ సందర్బంగా కొత్తకుర్మ సత్తయ్య మాట్లాడుతూ..రైతులకోసం 3 నూతన గోడౌన్ లు ధన్యము స్టోరేజ్ కోసం నిర్మిస్తునట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో సొసైటీ వైస్ చైర్మన్ కొత్త రాంరెడ్డి,డైరెక్టర్లు సంజీవ్ రెడ్డి,వంగేటి లక్ష్మారెడ్డి,సొసైటీ సీఈఓ వై.రాందాస్ తదితరులు పాల్గొన్నారు.

# పలు గ్రామాలలో సన్నబియ్యం పంపిణీ చేసిన కాంగ్రెస్ పార్టీ నాయకులు




**చేగుంట,ఏప్రిల్08(సూర్య రేఖ)** మెదక్ జిల్లా చేగుంట మండలంలోని పలు గ్రామాలు అయినా బోనాల కొండాపూర్,కసాన్ పల్లి,చందాయిపేట గ్రామాలలో దుబ్బాక నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి చెరుకు శ్రీనివాస్ రెడ్డి ఆదేశాల మేరకు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వడ్ల నవీన్ కుమార్ సన్న బియ్యం పంపిణీ చేశారు.ప్రతి పేద వాళ్ళు సైతం పెద్దల మాదిరిగానే సన్న బియ్యంతో అన్నం తినాలన్న ఉద్దేశంతో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పౌర సరఫరాల శాఖ ఆధ్వర్యంలో ఆహార భద్రత పథకంలో భాగంగా రేషన్ కార్డు ఉన్న లబ్ధిదారులకు సన్న బియ్యం పథకాన్ని ప్రారంభించిందని వారు చెప్పారు.ప్రజా పంపిణీ వ్యవస్థలో సన్న బియ్యం పంపిణీ పథకం చారిత్రాత్మక నిర్ణయమన్నారు.ఈ కార్యక్రమం మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు మోహన్ నాయక్,యువ నాయకులు సంధ్రుగు శ్రీకాంత్,గ్రామ నాయకులు పబ నగేష్ సెట్,దిలర్ మాణిక్య రెడ్డి,నాగరాజు,దండు మహేష్,బజారి రాజు,ఎండీ యూసుఫ్,దండు,సత్తయ్య,నాయకులు పబ నగేష్ సెట్,దీలర్ల మాణిక్య రెడ్డి,కేతావత్ నరసింహులు,యాదవ రెడ్డి, కార్యకర్తలు,మహిళలు,లబ్ధిదారులు పాల్గొన్నారు.

# అప్పులపాలై ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దు

గేమ్స్ ఆడినా,ప్రోత్సాహించిన కఠిన శిక్షలు తప్పవు..
అత్యాశకు పోయి ఆన్ లైన్ పెట్టుబడులు పెట్టొద్దు..
రామాయంపేట సర్కిల్ ఇన్స్పెక్టర్ వెంకటరాజా గౌడ్..



**రామాయంపేట,ఏప్రిల్08(సూర్య రేఖ)** యువత, విద్యార్థులు అక్రమ బెట్టింగ్ యాప్స్ గేమ్ యాప్ కు అలవాటు పడి అప్పులపాలై ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారని,అక్రమ బెట్టింగ్ యాప్స్ లలో బెట్టింగ్ కు పాల్పడిన ఆన్లైన్ గేమింగ్ యాప్లోగేమ్స్ ఆడినా,ప్రోత్సాహించిన కఠిన శిక్షలు తప్పవని రామాయంపేట సర్కిల్ ఇన్స్పెక్టర్ వెంకట రాజా గౌడ్ హెచ్చరించారు.నేటి సమాజంలో సాంకేతిక పరిజ్ఞానం,సోషల్ మీడియా ప్రభావం బాగా పెరిగింది. ప్రతిఒక్కరికీ ఇంటర్నెట్ అందుబాటులో ఉండడం,కొన్ని సందర్భాల్లో అవగాహనలోపం వల్ల చాలామంది ప్రజలు యువత ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. అవగాహన లేక అత్యాశకు పోయి ఆన్ లైన్ నందు పెట్టుబడులు పెట్టడం వల్ల కూడా ప్రజలు మోసాల భారీన పడుతున్నారు.

**బెట్టింగ్ యాప్లను ప్రమోట్ చేస్తే కఠిన చర్యలు...**

బెట్టింగ్ యాప్‌లు చాలా ప్రమాదకరమైనవన్నారు. వీటిల్లో ఒక్కసారి చిక్కుకుంటే బయటకు రావడం ఇబ్బంది అవుతుంది.యాప్ నిర్వాహకుల నుండి బెదిరింపులు వస్తాయన్నారు.తక్కువ సమయంలో ఎక్కువ డబ్బులు సంపాదించవచ్చన్న భ్రమలో యువత,విద్యార్థులు అక్రమ బెట్టింగ్ యాప్స్ గేమింగ్ యాప్స్ కు బానిసలుగా మారి అప్పులపాలపై ప్రాణాలకు మీదకు తెచ్చుకొని విలువైన ప్రాణాలు పోగొట్టుకుంటున్నారు.అక్రమ బెట్టింగ్ యాప్స్ లలో బెట్టింగ్ కి పాల్పడిన,ఆన్లైన్ గేమింగ్ యాప్ లలో గేమ్స్ ఆడినా, ప్రోత్సాహించిన కఠిన శిక్షలు తప్పవని హెచ్చరించారు.ఆన్లైన్ బెట్టింగ్,గేమింగ్ యాప్ లు ఆయా యాప్ నిర్వాహకుల సూచనల మేరకే ఆపరేట్ చేయబడుతాయని,ఆన్లైన్ గేమింగ్ మాటున ప్రమాదకర మాల్ ప్రాక్టీస్ ఉంటుంది ఫేక్ లింక్స్ తో వ్యక్తి గత సమాచారం,అకౌంట్ వివరాలు తెలుసుకొనే అవకాశం ఉన్నందున గేమింగ్ యాప్ ల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు.ఈ అక్రమ బెట్టింగ్ యాప్లను సోషల్ మీడియా వేదికగా ప్రచారం చేసే ఎవరిపైనా ఉపేక్షించేది లేదని ప్రజలు,యువత అప్రమత్తంగా ఉండి.ఇటువంటి కార్యకలాపాలపై వెంటనే డయల్ 100కు,స్థానిక పోలీస్ వారికి సమాచారం అందిస్తే చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.జిల్లాలో సోషల్ మీడియా ఇన్ఫ్ ఎన్సర్లు బాధ్య తాయుతంగా వ్యవహరించాలని,అక్రమ బెట్టింగ్ యాప్లకు సంబంధించి ప్రచారాన్ని చేయవద్దని ఆన్లైన్ బెట్టింగ్,ఆన్లైన్ గేమ్స్ వలన కలిగే పరిణామాల గురించి ప్రజలకు అవగాహన కల్పించడం జరుగుతుందని సర్కిల్ ఇన్స్పెక్టర్ వెంకటరాజా గౌడ్ తెలిపారు.

## మహిళల కోసం ఆరోగ్య మహిళా క్లినిక్ ఏర్పాటు

డిఎంహెచ్ఓ శ్రీరామ్



**రామాయంపేట,ఏప్రిల్08(సూర్య రేఖ)** రామాయంపేట మండలం ప్రగతి ధర్మారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం జిల్లా డిఎంహెచ్ఓ శ్రీరామ్ ఆరోగ్య మహిళా క్లినిక్ ను ఆయన సందర్శించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ధర్మారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మహిళలకు ప్రత్యేకంగా ఆరోగ్య మహిళా క్లినిక్ ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.రామాయంపేట మండలంలోని అన్ని గ్రామాలకు చెందిన మహిళలు ఎవరైనా అధిక రక్తపోటు, మధుమేహం,గుండెకు సంబంధించిన వ్యాధులు క్యాన్సర్ లాంటి వ్యాధులు ఉన్న మహిళల కోసం ప్రతి మంగళవారం ధర్మారం ఆరోగ్య కేంద్రంలో పరీక్షలు చేసి మందులు పంపిణీ చేస్తామని పేర్కొన్నారు.వ్యాధి తీవ్రత ఎక్కువగా ఉన్న మహిళలను జిల్లా ఆసుపత్రికి పంపించి వారికి తగిన మందులను పంపిణీ చేస్తామని వెల్లడించారు. మొత్తం మీద గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న మహిళలు ఆరోగ్యంగా ఉండడానికి దృష్టి సారించి తాము పనిచేస్తున్నట్లు తెలియపరచారు.ఈ కార్యక్రమంలో మండల వైద్యాధికారిణి డాక్టర్ హరిప్రియ,ఆసుపత్రి సిబ్బంది,ఏఎన్ఎంలు మహిళలు పాల్గొన్నారు.

## వడియారం ప్రాథమిక పాఠశాలను సందర్శించిన ఏఎంఓ సుదర్శణా మూర్తి



**చేగుంట,ఏప్రిల్08(సూర్య రేఖ)** మెదక్ జిల్లా చేగుంట మండలం వడియారం ప్రాథమిక పాఠశాలను జిల్లా అకాడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ సుదర్శణమూర్తి సందర్శించారు.ఈ సందర్భంగా పాఠశాలలో నిర్వహించిన ఎఫ్ఎల్ఎన్ బేస్ లైన్ టెస్ట్,ఎండ్ లైన్ టెస్ట్ ఫలితాలను సమీక్షించారు.తరగతి గదిలోని విద్యార్థుల వర్క్ బుక్ లను పరిశీలించి తగు సూచనలు ఇచ్చారు.చదవడంలోనూ,రాయడంలోనూ చతుర్విధ ప్రక్రియలను విద్యార్థుల ద్వారా సమాధానాలు రాబట్టి సంతృప్తి చెందారు. ప్రధానోపాధ్యాయులు సిద్ధిరాములు ఉపాధ్యాయులు వసంత, సంతోషి మాత,అమరేశ్వరి పాల్గొన్నారు.

## ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కేసులో నిందితునికి సంవత్సరం జైలు శిక్ష..

సిఐ ఇంద్రసేనారెడ్డి



**గోదావరిఖని,ఏప్రిల్ 08(సూర్యరేఖ)**గోదావరిఖని వన్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని అడ్డగుంటపల్లి 2017లో దళిత మహిళను కులం పేరుతో దూషిస్తూ శారీరకంగా ఇబ్బంది పెట్టిన రాజీవ్ కకాలనీకి చెందిన ఆవుల మల్లయ్యకు కరీంనగర్ ఎస్సీ,ఎస్టీ కోర్టు జడ్జి నిందితునికి సంవత్సరం జైలు శిక్ష రూ.3 వేలు జరిమానా విధించారని సీఐ ఇంద్రసేనారెడ్డి తెలిపారు.కేసును సాక్షాదారులతో నిరూపించిన కోర్టు కానిస్టేబుల్ మహేందర్ ఏఎస్ఐ తిరుపతి రావులను రామగుండం సిపి అంబర్ కిషోర్ఝా,పెద్దపల్లి డిసిపి కరుణాకర్,గోదావరిఖని ఏసిపి మడత రమేష్ అభినందించారు.ప్రభుత్వం తరఫున వాదించిన లాయర్ రాములును సిపి అంబర్ కిషోర్ఝా ప్రత్యేకంగా అభినందించారు.

## నిర్దేశిత సమయంలో అభివృద్ధి పనులు పూర్తి కావాలి..

జనవరి 2026 నాటికి నూతనంగా నిర్మిస్తున్న 7 తహసిల్దార్ కార్యాలయాలు పూర్తి..
పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ పై సమీక్ష నిర్వహించిన
జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష



**పెద్దపల్లి,ఏప్రిల్ 08(సూర్యరేఖ)** పంచాయతీరాజ్ శాఖ పరిధిలో చేపట్టిన అభివృద్ధి పనులను నిర్దేశిత సమయంలో పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ...మన జిల్లాలో చేపట్టిన 7 తహసిల్దార్ నూతన కార్యాలయ భవన నిర్మాణ పనులు సకాలంలో పూర్తి చేయాలని, రాబోయే జనవరి 2026 నాటికి నూతన తహసిల్దార్ కార్యాలయాల ప్రారంభోత్సవం కావాలని అన్నారు.మంథని పట్టణంలో 4.5 కోట్లతో చేపట్టిన సమీకృత కార్యాలయాల సముదాయం పనులను రాబోయే ఉగాది నాటికి పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు.గ్రామీణ పంచాయతీ రాజ్ విభాగానికి సంబంధించి పురోగతి ఉన్న పనులు త్వరగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొని రావాలని అన్నారు.జిల్లాలోని హెల్త్ సెంటర్స్ మరమ్మత్తు పనులు,సబ్ సెంటర్ భవనాలు,పాఠశాలల మరమ్మత్తు, కాంపౌండ్ వాల్ నిర్మాణ పనులు, రెసిడెన్షియల్ పాఠశాలల,హాస్టల్ మరమ్మత్తు పనులకు నిధులు మంజూరు చేయడం జరిగిందని, అందుబాటులో ఉన్న నిధులను వినియోగించుకుంటూ సమ్మర్ సీజన్ పూర్తయ్యే లోపు పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో ఈఈ పంచాయతీరాజ్ గిరీష్ బాబు,డి.ఆర్.డి.ఓ.కాళిందిని,సంబంధిత అధికారులు,తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలి





**నిర్మాణాలు వేగవంతంగా ఉండేందుకు లబ్ధిదారులను ప్రోత్సహించాలి... హౌసింగ్ అధికారులను ఆదేశించిన జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్... యువత రాజీవ్ యువ వికాసం పథకాన్ని సద్వినియోగించుకోవాలి మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్..**

**రామాయంపేట,ఏప్రిల్08(సూర్య రేఖ)** మెదక్ జిల్లా కలెక్టర్ క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా రామాయంపేట పరిధిలో దామరచెరువు గ్రామంలో కలెక్టర్ ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పురోగతిని పరిశీలించారు. అనంతరం రామాయంపేటలో ఇందిరమ్మ మోడల్ హౌస్ ను పరిశీలించారు. ఎంపీడీవో కార్యాలయంలో హౌసింగ్ అధికారులతో కలెక్టర్,రాజీవ్ యువ వికాసం హెల్ప్ డెస్క్ ను సమావేశం ఏర్పాటుచేసి కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా మండలంలో ఎంపిక చేసిన గ్రామంలో కొనసాగుతున్న ఇందిరమ్మ ఇళ్ల, మోడల్ ఇంటి నిర్మాణ పనులపై ఆరా తీశారు. ఇంటి లోపల డిజైన్,సౌకర్యాలపై అధికారులకు, సిబ్బందికి కీలక సూచనలు చేశారు. పనులను గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఇంటి నిర్మాణంలో నాణ్యతకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ఇందిరమ్మ మోడల్ హౌసింగ్ పథకం ద్వారా పేదలకు మంచి గృహాలు అందించడమే లక్ష్యమని తెలిపారు. పనుల్లో ఆలస్యం లేకుండా నాణ్యతతో కూడిన నిర్మాణం జరగాలని అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఆయన క్షేత్ర స్థాయిలో పర్యవేక్షిస్తూ లబ్ధిదారులను ప్రోత్సహిస్తున్నామన్నారు. అనంతరం రామాయంపేటలో రాజీవ్ యువ వికాసం పథకం హెల్ప్ డెస్క్ ను కలెక్టర్ సందర్శించారు. దరఖాస్తు చేసుకున్న వారి వివరాలను అడిగి తెలుసుకున్నారు. బీసీ,ఎస్సీ, ఎస్టీ మైనార్టీ యువతీ యువకులకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు గాను రాష్ట్ర ప్రభుత్వం రాజీవ్ యువ వికాసం పథకాన్ని అమలు చేస్తోందని పేర్కొన్నారు. నిరుద్యోగులు స్వయం ఉపాధి యూనిట్లు నెలకొల్పుకొని,తమ ఆర్థిక స్థితిని మెరుగుపరుచుకునేందుకు యువతకు సబ్సిడీ రుణాలు మంజూరు చేస్తుందని యువత రాజీవ్ యువ వికాసం పథకం సద్వినియోగం చేసుకోవాలని లబ్ది పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ పీడీ మాణిక్యం,హౌసింగ్ అధికారులు,సంబంధిత రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# రామగుండంలో 800 మెగావాట్ల విద్యుత్ కేంద్ర స్థాపనకు ఎమ్మెల్యే చొరువ

**ఎమ్మెల్యేకు అభినందనలు తెలిపిన తెలంగాణ రాష్ట్ర విద్యుత్ ఉత్పత్తి సంస్థ ఉద్యోగులు**



**రామగుండం,ఏప్రిల్ 08(సూర్యరేఖ)** స్థానిక గాంధీనగర్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో తెలంగాణ రాష్ట్ర విద్యుత్ ఉత్పత్తి సంస్థ ఉద్యోగులు రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు రామగుండంలో 800 మెగావాట్ల కొత్త విద్యుత్ కేంద్రాన్ని స్థాపించేందుకు తీసుకున్న చొరవకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ ప్రాజెక్టు రామగుండం ప్రాంత అభివృద్ధికి, రాష్ట్రానికి అవసరమైన విద్యుత్ అవసరాలను తీర్చేందుకు ఎంతో మేలు చేస్తుందని ఉద్యోగులు పేర్కొన్నారు. ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ మాట్లాడుతూ. “రాష్ట్ర అభివృద్ధికి విద్యుత్ అవసరం ఎంతగానో ఉంది. రామగుండంలో ఈ ప్రాజెక్టు ద్వారా స్థానికులకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయి, అలాగే విద్యుత్ రంగంలో నూతన మైలురాయి అవుతుంది,”విద్యుత్ కేంద్ర స్థాపనకు కృషి చేసిన ముఖ్యమంత్రి అనుముల రేవంత్ రెడ్డి, ఉపముఖ్యమంత్రి మల్లు బట్టి విక్రమార్క, మంత్రివర్యులు దుద్దిల్ల శ్రీధర్ బాబు,రామగుండం ప్రజల పక్షాన కృతజ్ఞతలు తెలిపారు. ఇంత పెద్ద ప్రాజెక్టును రామగుండంలో ఏర్పాటు చేయడంపై స్థానికులు సంతోషం వ్యక్తం చేశారు. శాశ్వతంగా విద్యుత్ సమస్యలకు ఇది పరిష్కారం కావచ్చని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర విద్యుత్ ఉత్పత్తి సంస్థలో పనిచేస్తున్న ఉద్యోగులు, పలువురు సీనియర్ ఇంజినీర్లు, సిబ్బంది, యూనియన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

# లీగల్ ఫైట్‌కు రెడీ అవుతున్న తెలంగాణ

**హైదరాబాద్ :** ఏపీ సాగునీటి ప్రాజెక్టులపై తెలంగాణ సర్కార్ న్యాయపోరాటానికి సిద్ధమైంది. రాయలసీమ ఎత్తిపోతల, బనకచర్ల ప్రాజెక్టులపై సుప్రీంకోర్టుకు వెళ్లాలని నిర్ణయించింది. హైదరాబాద్ లోని జలసౌధలో నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఉన్నతస్థాయి సమీక్షా సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిపాదించిన రెండు ప్రధాన నదుల అనుసంధాన ప్రాజెక్టులైన గోదావరి-బనకచెర్ల లింక్ స్కీం, రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్ (ఆర్ఎల్ఐఎస్)పై తెలంగాణ ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించనుంది హైదరాబాద్ లోని జలసౌధలో నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఉన్నతస్థాయి సమీక్షా సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. పోలవరం-బనకచర్ల లింక్ ప్రాజెక్టుకు ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన జరిగిన ఆంధ్రప్రదేశ్ మంత్రివర్గం ఇటీవలనే ఆమోదం తెలిపింది. సుప్రీంకోర్టులో పిటిషన్ వేసేందుకు అనుసరించాల్సిన వ్యూహాలపై న్యాయనిపుణులు, నీటి పారుదల శాఖ స్టాండింగ్ కౌన్సిల్స్, అడ్వకేట్ జనరల్ తో ప్రత్యేక సమావేశం నిర్వహిస్తామని ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. పోలవరం-బనకచర్ల లింక్ ప్రాజెక్టు 1980 నాటి గోదావరి జల వివాదాల ట్రిబ్యునల్ (జీడబ్ల్యూడీటీ) అవార్డును, 2014 ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టాన్ని (ఏపీఆర్ఏ) నేరుగా ఉల్లంఘిస్తోందన్నారు. రాయలసీమలోని నాలుగు జిల్లాలైన కడప, కర్నూలు, అనంతపురం, చిత్తూరులోని 1.9 మిలియన్ల ఎకరాలకు సాగునీరు అందించేందుకు 2020 ఆగస్టులో వైఎస్ జగన్ సర్కార్ ప్రభుత్వం రాయలసీమ ఎత్తిపోతల పథకం (ఆర్ఎల్ఐఎస్)ను చేపట్టింది. ఈ పథకాన్ని కూడా సవాలు చేయాలని సమావేశం తెలంగాణ సర్కార్ నిర్ణయించింది. గోదావరి, కృష్ణా నదీ జలాల్లో తమకు రావాల్సిన న్యాయమైన వాటాను కాపాడుకుంటామని మంత్రి ఉత్తమ్ చెప్పారు. ఏపీ ప్రభుత్వం తీసుకువచ్చిన ఈ రెండు ఇరిగేషన్ ప్రాజెక్టులు?. నీటి పంపకాల ఒప్పందాలను ఉల్లంఘిస్తున్నాయని చెప్పారు. తెలంగాణ సాగునీటి ప్రాజెక్టులు, తాగునీటి అవసరాలకు తీవ్ర ముప్పుగా మారుతాయని చెప్పుకొచ్చారు. సంబంధిత రెగ్యులేటరీ అథారిటీల అనుమతి లేకుండా ఆంధ్రప్రదేశ్ ఏకపక్షంగా ప్రాజెక్టులను చేపడుతోందని మంత్రి ఉత్తమ్ పేర్కొన్నారు. ఈ విషయంలో తెలంగాణ ప్రభుత్వం మౌనంగా ఉండబోదని? అక్రమ నిర్మాణాలు, నీటి మళ్లింపును అడ్డుకునేందుకు సుప్రీంకోర్టులో ఈ అంశాన్ని లేవనెత్తుతామని ప్రకటించారు. రూ. 80,112 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టిన పోలవరం - బనకచర్ల లింక్ ప్రాజెక్టులో గోదావరి నది నుంచి బొల్లాపల్లి రిజర్వాయర్, బనకచర్ల హెడ్ రెగ్యులేటర్ ద్వారా 200 టీఎంసీల నీటిని రాయలసీమకు మళ్లించాలని ఏపీ సర్కార్ నిర్ణయించింది. గోదావరి, కృష్ణా, పెన్నా నదులను అనుసంధానం చేయాలని ప్రతిపాదించింది. పోలవరం లింక్ ప్రాజెక్టును 100 శాతం ప్రభుత్వ ఆధీనంలోని జల హారతి కార్పొరేషన్ పేరుతో స్పెషల్ పర్పస్ వెహికల్ (ఎస్పీవీ) ఏర్పాటుకు ఏపీ కేబినెట్ ఆమోదం తెలిపింది. కోట్ల వ్యయంతో చేపట్టిన ఆర్ఎల్ఐఎస్ ప్రాజెక్టు ద్వారా సంగమేశ్వరం సమీపంలోని శ్రీశైలం జలాశయం నుంచి రోజుకు మూడు టీఎంసీల నీటిని ఎత్తిపోస్తారు. శ్రీశైలం కుడి ప్రధాన కాలువ (ఎస్ఆర్ఎంసీ)లోకి పంపింగ్ చేసి నాలుగు జిల్లాల్లోని వివిధ సాగునీటి కాలువలకు నీరందించనున్నారు. ప్రాజెక్టుతో తెలంగాణకు తీవ్రస్థాయిలో నీటి కొరత ఏర్పడే అవకాశం ఉంటుందని రేవంత్ ప్రభుత్వం భావిస్తోంది. ఇందులో భాగంగానే? సుప్రీంకోర్టును ఆశ్రయించాలని నిర్ణయించింది. పోలవరం-బనకచర్ల లింక్ ప్రాజెక్టుకు కేంద్ర జలసంఘం (సీడబ్ల్యూసీ), గోదావరి నదీ యాజమాన్య బోర్డు (జీఆర్ఎంబీ), కృష్ణా నదీ యాజమాన్య బోర్డు (కేఆర్ఎంబీ), అపెక్స్ కౌన్సిల్ నుంచి ఆంధ్రప్రదేశ్ తప్పనిసరిగా అనుమతులు పొందలేదని తెలంగాణ ప్రభుత్వం చెబుతోంది. వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి వీలు కల్పించే ఏపీ విభజన చట్టంలోని సెక్షన్లు 46(2), 46(3)లను ఉపయోగించుకుని కేంద్ర నిధులను పొందేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రయత్నిస్తోందని మంత్రి ఉత్తమ్ ఆరోపించారు. అయితే ఇలాంటి నిబంధనలు చట్టబద్ధమైన అనుమతులు, పర్యావరణ పరిరక్షణ ఆవశ్యకతను అధిగమించలేవని హెచ్చరించారు.

## అదిలాబాద్ ఎయిర్ పోర్టు అడుగులు

**అదిలాబాద్ :** విమానాశ్రయం ఏర్పాటు కోసం దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న ఆదిలాబాద్ వాసుల కలలు త్వరలోనే ఫలించబోతున్నాయి. ఆదిలాబాద్‌లోని రక్షణశాఖకు సంబంధించిన వైమానిక విమానాశ్రయంలో.. పౌరవిమానయాన సేవలు ప్రారంభించేందుకు సిద్ధంగా ఉన్నట్లు రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ తెలిపారు. ఆదిలాబాద్ విమానాశ్రయంలో వాయుసేన శిక్షణ సంస్థను ఏర్పాటు చేయబోతున్నామని, దీంతో పాటు.. పౌర విమాన సేవల కోసం ఉమ్మడి కార్యాచరణ చేపట్టేందుకు సానుకూలంగా ఉన్నట్లు ఆయన క్లారిటీ ఇచ్చారు. స్థానిక ప్రజలు, పలు పార్టీల నాయకుల నుంచి కొంతకాలంగా వస్తున్న విజ్ఞప్తుల నేపథ్యంలో కేంద్ర మంత్రి రాజ్‌నాథ్ సింగ్ 29 జనవరి, 2025 నాడు లేఖ రాశామని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి చెప్పారు. వ్యక్తిగతంగా కలిసి ఆదిలాబాద్ విమానాశ్రయానికి సంబంధించిన భూములను ప్రజావసరాలకు సద్వినియోగం చేసేలా చొరవ తీసుకోవాలని కోరామని అన్నారు. దీనిపై వారు రక్షణ శాఖ అధికారులతో చర్చించిన తర్వాత సానుకూల నిర్ణయాన్ని తెలియజేస్తూ నిన్న లేఖ రాశారని చెప్పుకొచ్చారు. రాజ్‌నాథ్ సింగ్ సానుకూల స్పందనను హృదయపూర్వకంగా స్వాగతిస్తున్నామని ఆయన తెలిపారు. ఇందుకుగానూ ప్రధాని నరేంద్రమోదీ, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడుకి హృదయపూర్వక ధన్యవాదములు తెలియజేస్తున్నామని చెప్పారు. ‘పత్తి వ్యాపారానికి, ఇతర వ్యవసాయ ఉత్పత్తులకు ఆదిలాబాద్ ప్రధానమైన కేంద్రంగా ఉంది. దీంతో ఆదిలాబాద్ తో పాటుగా చుట్టుపక్కల ప్రాంతాల ప్రజల నుంచి.. విమానాశ్రయాన్ని ఏర్పాటు చేసే విషయంలో చొరవ తీసుకోవాలని దశాబ్దాలుగా డిమాండ్ వినిపిస్తోంది. దీనిపై నేను 7 జూలై 2022, 15 ఫిబ్రవరి 2023నాడు నాటి ముఖ్యమంత్రికి లేఖలు రాశాం. ఐదేళ్లుగా ఈ విషయంపై పదే పదే నేను ప్రస్తావించాను. అయినా రాష్ట్ర ప్రభుత్వం సహకరించలేదు’ అని కిషన్ రెడ్డి వ్యాఖ్యానించారు. ‘అటు, ప్రజల డిమాండ్‌కు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం సహకరిస్తే విమానయాన సేవలను ప్రారంభించేందుకు అవసరమైన ప్రక్రియను ప్రారంభిస్తామని 2021 అక్టోబర్ లో నాటి పౌరవిమానయాన శాఖ మంత్రి జ్యోతిరాదిత్య సింధియా కూడా నాటి సీఎంకి లేఖ రాశారు. కానీ దీనికి రాష్ట్ర ప్రభుత్వం నుంచి స్పందన రాలేదు. కానీ ప్రజల డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని.. వారి నుంచి వస్తున్న విజ్ఞప్తులను దృష్టిలో ఉంచుకుని.. నేను రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ తో, పౌర విమానయాన శాఖ మంత్రి శ్రీ రామ్మోహన్ నాయుడుకి లేఖలు రాయడంతో పాటుగా వ్యక్తిగతంగా కలిసి విజ్ఞప్తి చేశాను’ అని చెప్పారు.

వరంగల్ విమానాశ్రయానికి అనుమతులు లభించడంతో.. విమానాశ్రయం ఏర్పాటుకు అవసరమైన భూసేకరణను రాష్ట్ర ప్రభుత్వం త్వరగా పూర్తి చేసి ఇస్తే.. ఇతర మౌలిక సదుపాయాల నిర్మాణ పనులు కూడా వేగవంతం చేసేందుకు వీలవుతుంది. తద్వారా వీలైనంత త్వరగానే.. వరంగల్ ప్రజల స్వప్నం సాకారం కానుంది. గత నెలలో.. వరంగల్ విమానాశ్రయం ఏర్పాటు, ఇందుకు సంబంధించిన పురోగతి తదితర విషయాలను నేను, రామ్మోహన్ నాయుడు సంయుక్త మీడియా సమావేశంలో వెల్లడించాం’ అని కిషన్ రెడ్డి చెప్పుకొచ్చారు. రీజనల్ కనెక్టివిటీ స్కీమ్ ? ఉడే దేశ్ కా ఆమ్ నాగరిక్ పథకంలో భాగంగా.. దాదాపు 620 రూట్లలో ఇప్పటికే హైదరాబాద్‌కు 60 రూట్స్ (10%) ఆపరేషన్‌లో ఉన్నాయి. వరంగల్, ఆదిలాబాద్‌లో కూడా విమానాశ్రయాల సేవలు ప్రారంభిస్తే తెలంగాణకు ఉడాన్ కింద మరికొన్ని రూట్స్ అందుబాటులోకి రానున్నాయి. ఇది ప్రజల ప్రయాణంతో పాటుగా.. ఈ ప్రాంతంలో వాణిజ్యాభివృద్ధికి కూడా తోడ్పడనుంది’ అని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తెలిపారు. ఆదిలాబాద్‌లో గతంలోనే విమానాశ్రయం ఉండేది. దీన్ని సైనిక అవసరాల కోసం మాత్రమే వినియోగించేవారు. కాలక్రమేణా.. వివిధ కారణాలతో రక్షణ శాఖ కార్యకలాపాలు కూడా ఆగిపోయాయి. ఇప్పుడు ఈ విమానాశ్రయాన్ని తిరిగి యాక్టివేట్ చేయడం రక్షణశాఖకు, పౌర సేవలకు ఎంతో ఉపయోగపడనుంది. తెలంగాణలో విమానాశ్రయాల అభివృద్ధి పట్ల నరేంద్రమోదీ ప్రభుత్వానికి ఉన్న నిబద్ధతకు ఇది నిదర్శనం. విమానాశ్రయాల ఏర్పాటు వల్ల మన వ్యవసాయ ఉత్పత్తులు.. దేశీయ, అంతర్జాతీయ మార్కెట్లను చేరుకునేందుకు మార్గం సుగమం కానుంది. రాష్ట్ర ప్రభుత్వం త్వరితగతిన ఆయా విమానాశ్రయాల ఏర్పాటుకు అవసరమైన భూమిని సేకరించడంతో పాటుగా సంపూర్ణ సహకారం అందిస్తే.. వరంగల్, ఆదిలాబాద్ విమానాశ్రయాలు వీలైనంత త్వరగా ప్రజలకు సేవలందిస్తాయి’ అని కిషన్ రెడ్డి వ్యాఖ్యానించారు.

## హైదరాబాద్‌లో బీజేపీ వెర్సస్ ఎంఐఎం..

**కాంగ్రెస్, బీఆర్ఎస్ మద్దతు ఎవరికి..?**

**హైదరాబాద్ :** హైదరాబాద్‌లో లోకల్‌బాడీ ఎమ్మెల్సీ ఎన్నికల వేడి రాజుకుంది. పువ్వు పార్టీ-పతంగి పార్టీ సై అంటే సై అంటున్నాయి. చివరి నిమిషంలో హైదరాబాద్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బరిలోకి దిగింది బీజేపీ.. గెలిచేందుకు తగినంత బలం లేకపోయినా ఈ ఎన్నికల్లో పోటీ చేస్తామని కొద్దిరోజుల క్రితమే ప్రకటించిన బీజేపీ నేతలు.. నామినేషన్ల చివరి రోజు అభ్యర్థిని ప్రకటించింది. పార్టీ నేత గౌతమ్‌రావును ఎమ్మెల్సీ అభ్యర్థిగా బరిలోకి దింపింది. పార్టీ కార్యకర్తగా ఉన్న తనకు ఎమ్మెల్సీగా పోటీ చేసే అవకాశం దక్కిందని.. ఈ ఎన్నికల్లో తాము ఎలా గెలుస్తామో ముందు ముందు తెలుస్తుందని గౌతమ్ రావు అన్నారు. పార్టీ నేతలతో కలిసి నామినేషన్ దాఖలు చేశారుమరోవైపు గౌతమ్‌రావు ఎంపికపై బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్ అసంతృప్తి వ్యక్తం చేశారు. హైదరాబాద్ పార్లమెంట్ పరిధిలో అభ్యర్థులే లేరా అని ప్రశ్నించారు. అధిష్ఠానానికి సీనియర్లు, కార్యకర్తలు కనబడలేదా ? అని కామెంట్ చేశారు. అయితే గౌతమ్‌రావు అభ్యర్థిత్వంపై అభ్యంతరం వ్యక్తం చేసిన రాజాసింగ్‌తో మాట్లాడతామని ఆ పార్టీ నేతలు పేర్కొంటున్నారుమరోవైపు ఈ ఎమ్మెల్సీ ఎన్నికతో కాంగ్రెస్, బీఆర్ఎస్ ఫెవికాల్ బంధం బట్టబయలైందని ఆరోపించారు కేంద్రమంత్రి బండి సంజయ్. మొన్న డీలిమిటేషన్‌తో ఏకమైన ఈ రెండు పార్టీలు.. పార్లమెంట్‌లో వక్ఫ్ బోర్డు బిల్లుకు వ్యతిరేకంగా ఓటేశాయన్నారు. లేటెస్ట్‌గా మజ్లిస్‌ను గెలిపించేందుకు ఈ రెండు పార్టీలు ఎన్నికలకు దూరంగా ఉన్నాయని విమర్శించారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ కుమ్మక్కు రాజకీయాలకు ఇదే నిదర్శనమన్నారు.

ఎంఐఎం అభ్యర్థిగా మిర్జా రియాజ్ ఉల్ హసన్

ఎంఐఎం తరపున ఎమ్మెల్సీ అభ్యర్థిగా మిర్జా రియాజ్ ఉల్ హసన్ నామినేషన్ దాఖలు చేశారు. గతంలో ఎమ్మెల్సీ, కార్పొరేటర్‌గా పనిచేసిన మిర్జా.. మరోసారి ఎమ్మెల్సీ అభ్యర్థిగా బరిలోకి దిగారు. ఇక ఈ ఎన్నికల్లో తమ గెలుపు లాంఛనమే అని ఎంఐఎం ధీమా వ్యక్తం చేసింది.


మొత్తం 112 మందికి ఓటు హక్కు

ఈ ఎమ్మెల్సీ ఎన్నికల బరి నుంచి కాంగ్రెస్, బీఆర్ఎస్ తప్పుకోవడంతో పోటీ ఎంఐఎం, బీజేపీ మధ్యే ఉండబోతోంది. ఈ ఎన్నికల్లో మొత్తం 112 మంది నేతలకు ఓటు హక్కు ఉంది. ఇందులో 81 మంది కార్పొరేటర్లు, 15 మంది ఎమ్మెల్యేలు, 9 మంది ఎంపీలు, ఏడుగురు ఎమ్మెల్సీలు ఉన్నారు. ఇక పార్టీలవారీగా బలాబలాలు చూస్తే కాంగ్రెస్‌కు 14, ఎంఐఎంకు 49, బీఆర్ఎస్‌కు 24, బీజేపీకి 25 సభ్యుల బలం ఉంది. ఈ ఎన్నికకు సంబంధించిన పోలింగ్ ఏప్రిల్ 23న జరగనుంది.

## పేరుకు రైజింగ్ స్టేట్..కానీ వైద్య సేవలకు దిక్కులేదు

**విజయవాడ :** ఏపీ పేరుకు రైజింగ్ స్టేట్..కానీ వైద్య సేవలకు దిక్కులేదు. పేదోడి ఆరోగ్యానికి రాష్ట్రంలో భరోసా లేదని ఏపీసీసీ ఛీఫ్ షర్మిలా రెడ్డి అన్నారు. ప్రజారోగ్యంపై కూటమి ప్రభుత్వానిది అంతులేని నిర్లక్ష్యం. ఆరోగ్య శ్రీ సేవల కింద రూ.3500 కోట్లు పెండింగ్ పెట్టడం నిజంగా సిగ్గుచేటు. గత 9 నెలలుగా పూర్తి స్థాయిలో బకాయిలు విడుదల చేయకుండా, వైద్య సేవలు ఆపేదాక చూడటం అంటే, ఆరోగ్యశ్రీ పై సర్కారుకున్న చిత్తశుద్ధి ఏంటో అర్థమౌతుందని అన్నారు. పథకాన్ని నిర్వీర్యం చేసే కుట్రలో భాగమే ఇదంతా. కూటమి ప్రభుత్వం అధికారంలో వచ్చిన నాటి నుంచే, ఆరోగ్యశ్రీ అనారోగ్య శ్రీగా మారింది. పేదోడికి వైద్యం అందని ద్రాక్ష అయ్యింది. వైద్య సేవలను విస్తృత పరుస్తామని.. వైద్యానికి గ్లోబల్ సిటీగా చేస్తామని, గొప్పలు చెప్పే చంద్రబాబు గారు.. ముందు ఆరోగ్యశ్రీ నిధులు విడుదల చేయండని అన్నారు.

ఏ ప్రభుత్వం బకాయిలు పెట్టినా అవి చెల్లించాల్సిన బాధ్యత మీదే అని తెలుసుకోండి. వెంటనే ఆసుపత్రుల యాజమాన్యాలను చర్చలకు పిలవండి. తక్షణం వైద్య సేవలను తిరిగి ప్రారంభించేలా చర్యలు తీసుకోండి. రాష్ట్రంలో ఆరోగ్య శ్రీ కింద వైద్యం అందక ఏ ఒక్కరూ మృతిచెందినా, అవి కూటమి ప్రభుత్వం చేసిన హత్యలే అవుతాయని గుర్తుపెట్టుకోండి. పేదవారి ఆరోగ్యానికి సంజీవనిలా మారిన ఆరోగ్య శ్రీ పథకానికి, ఎటువంటి ఇబ్బందులు రాకుండా చూడాలని, కాంగ్రెస్ పార్టీ పక్షాన కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నామని అన్నారు.






# ఖతర్నాక్‌గా క్లీవేజ్ షోతో హీటెక్కిస్తున్న అమైరా దస్తూర్

# ప్రభాస్ బౌలింగ్‌లో సిక్స్ కొట్టబోయిన రామ్ చరణ్..

## క్యాచ్ పట్టిన పవన్ కళ్యాణ్

లమెగా పవర్ స్టార్ రామ్ చరణ్ నటించిన తాజా చిత్రం పెద్ది. ఈ మూవీ బుచ్చిబాబు దర్శకత్వంలో తెరకెక్కుతుంది. శ్రీరామనవమి సందర్భంగా మూవీకి సంబంధించిన గ్లింప్స్ విడుదల చేశారు. ఇందులో చరణ్ డైలాగ్స్‌తో పాటు ఆయన పర్ఫార్మెన్స్ అదిరిపోయింది. ఏదైనా నేలమీద ఉన్నప్పుడే చేసేయ్యాలి.. పుడాతామా ఏంటి మళ్లీ అంటూ ఉత్తరాంధ్ర యాసలో రామ్ చరణ్ చెప్పే డైలాగ్స్ కేక పుట్టించాయి.ముఖ్యంగా గ్లింప్స్ చివర్లో రామ్ చరణ్ కొట్టిన సిక్స్ షాట్ మాత్రం హైలెట్ అని చెప్పాలి. రామ్ చరణ్ క్రీజ్ వదిలి ఫ్రంట్ ఫుట్ వచ్చి హ్యాండిల్ ను నేలకు కొట్టి మళ్లీ లేచి బంతిని బలంగా కొట్టడం గ్లింప్స్‌కి హైలైట్ అని చెప్పాలి. ఇది మెగా అభిమానులకి మంచి ఫీస్ట్‌గా మారింది. అయితే ఈ షాట్ వీడియోకు రకరకాలుగా క్రియేటివ్ వీడియోస్ చేస్తూ షేర్ చేస్తున్నారు. . తాజాగా ఓ నెటిజన్ షేర్ చేసిన క్రియేటివ్ వీడియో అదిరిపోయింది. ప్రభాస్ బౌలింగ్‌లో రామ్ చరణ్ బ్యాటింగ్ చేయగా, దాన్ని పవన్ కళ్యాణ్ క్యాచ్ పట్టుకున్నట్టు చేసిన ఓ మీమ్ తెగ వైరల్ అవుతుంది. ముగ్గురు హీరోలు ఒకే ఫ్రేములో కనిపించే సరికి ఫ్యాన్స్ ఆనందానికి అవధులు లేవు. ఇక ఇదిలా ఉంటే రామ్ చరణ్ నటించిన 'గేమ్ ఛేంజర్' సినిమాపై మెగా అభిమానులు భారీ అంచనాలు పెట్టుకున్నారు. కాని ఈ సినిమా డిజాస్టర్ అయింది. ఇప్పుడు "పెద్ది" సినిమాపై మెగా అభిమానులు భారీ ఆశలు పెట్టుకున్నారు. ఫస్ట్ షాట్ పేరిట వచ్చిన గ్లింప్స్ ఆకట్టుకోవడంతో ఈ సినిమాపై అంచనాలు రెట్టింపు అయ్యాయి. 2026 మార్చి 27న ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రానుంది. ఉప్పెన ఫేం బుచ్చిబాబు సన దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాలో జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటిస్తోంది. ఏఆర్ రెహమాన్ చిత్రానికి సంగీతం అందిస్తున్నారు.చిత్రంలో రామ్ చరణ్ మాస్ అవతార్‌లో కనిపించనున్నాడు. రంగస్థలం తర్వాత తిరిగి రామ్ చరణ్ మాస్ లుక్‌లో కనిపించిన సినిమా ఇదే కావడంతో మూవీపై అంచనాలు ఏర్పడ్డాయి.



# ఉంటానో మధ్యలోనే తీసేస్తారో అనుకున్నా..

టాలీవుడ్ లో తెలుగమ్మాయిలు చాలా తక్కువ. ఉన్నవాళ్లలో కూడా రెగ్యులర్ సినిమాలు చేసేవాళ్లు ఇంకా తక్కువని చెప్పొచ్చు. రీసెంట్ గా 'మ్యాడ్ స్క్వేర్'లో లైలా పాత్రలో కనిపించిన అలరించిన ప్రియాంక జవాల్కర్ తెలుగు బ్యూటీనే. అనంతపురంలో పెరిగిన ఈమె.. తాజాగా ఓ ఇంటర్వ్?యరీలో మాట్లాడుతూ కెరీర్ ప్రారంభంలో అనుభవాల్ని పంచుకుంది. 'నేను సినిమాల్లో ప్రయత్నిస్తున్నానని మా ఇంట్లో తెలుసు. అలా నాకు విజయ్ దేవరకొండ 'ట్యాక్సీవాలా'చిత్రంతో  అవకాశమొచ్చింది. అయితే వారం రోజుల షూటింగ్ అయ్యేంత వరకు ఎవరికీ ఈ విషయం చెప్పలేదు. గీతా ఆర్ట్స్ లాంటి పెద్ద సంస్థలో నా మొదటి సినిమా. అసలు ఉంటానో మధ్యలోనే తీసేస్తారో అని భయంగా ఉండేది.' 'అందుకే షూటింగ్ మొదలైన వారం వరకు ఈ సినిమాలో నేనే హీరోయిన్ ఎవరికీ చెప్పలేకపోయా. కాస్త నమ్మకం రాగానే ఇంట్లో చెప్పాను. అప్పుడు వాళ్లు కూడా సంతోషపడ్డారు. తర్వాత అందరికీ చెప్పుకొన్నాను' అని ప్రియాంక చెప్పుకొచ్చింది. షార్ట్ ఫిల్మ్ తో కెరీర్ మొదలుపెట్టిన ప్రియాంక.. 2017లో 'కలవరమాయే' మూవీతో హీరోయిన్ అయింది. కానీ ట్యాక్సీవాలా చిత్రంతో గుర్తింపు వచ్చింది. తర్వాత ఎస్ఆర్ కల్యాణ మండపం, తిమ్మరసు, టిల్లు స్క్వేర్ తదితర చిత్రాలు చేసింది. కాకపోతే ఈమెకు పెద్దగా గుర్తింపు రాలేదు.

# 'గుడ్ బ్యాడ్ అగ్లీ' తెలుగు ట్రైలర్ విడుదల

కోలీవుడ్ స్టార్ హీరో అజిత్ కుమార్ నటించిన 'గుడ్ బ్యాడ్ అగ్లీ' తెలుగు ట్రైలర్ వచ్చేసింది. మైత్రి మేకర్స్ బ్యానర్‌లో  వై రవిశంకర్, నవీన్ యేర్నేని ఈ మూవీని నిర్మించారు. ఏప్రిల్ 10న ఈ చిత్రం విడుదల కానుంది. దర్శకుడు  అధిక్ రవిచంద్రన్ తెరకెక్కించిన ఈ చిత్రంలో హీరోయిన్‌గా త్రిష నటించారు. ఇప్పటికే  'గుడ్ బ్యాడ్ అగ్లీ' మూవీ తమిళ్ వర్షన్ ట్రైలర్ విడుదలైంది. ఏకంగా 35 మిలియన్లకు పైగా వ్యూస్ సాధించి ట్రెండింగ్‌లో ఉంది. ఫ్యాన్స్‌కు నచ్చే భారీ యాక్షన్ సీన్లు ఈ మూవీలో ఉన్నట్లు తెలుస్తోంది.



Ediited Printed & Published Mekkonda Premraj  on behalf MPR publications and Printed  RNI NO:TELTEL/ 2023/89546 Cell No.9397303326,